
కర్మయోగ పూర్ణ రహస్యం



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2012

సాధన — మౌలిక అష్టాంశాలు

శ్రీమాతారవింద ప్రవచనములు

విషయసూచిక

జీవన విజ్ఞానం

కర్మయోగం

ఓహ్! ఎందుకీ వ్యాకులపాటు

ఓహ్! అన్నీ నీ వనుకున్నట్లే వుండాలని అందుకు భిన్నంగా వుండగూడదని వ్యాకుల పాటుతో అనుకుంటావు ఎందుకని!

మనము అనుకున్నట్లుగానే ఒక విధమైన పరిస్థితులు వుంటే అపుడు మాత్రమే మనము అనుకున్నది సాధించగలమని నిర్ణయించుకొని, వాటిని సాధించడం కోసం, బాధ కలిగించే సంఘర్షణలో తలదూర్చడం ఎందుకు?

అన్ని కష్టముల నుండి అంధకారము నుండి, అహంకారం నుండి ఎల్లపుడు నీ ధర్మమే విజయం పొందుతుందని ఎవరైనా సరే తమ సమస్త శక్తిని అంతరంగిక ప్రశాంతతలో సంకల్పించుట యందే ఏల ఉపయోగించ రాదు!

ఈ వైఖరిని స్వీకరించడం ఎపుడు నేర్చుకొంటామో అపుడు మన దృష్టి పథపు సీమాంతర రేఖావలయము ఎంతగా విస్తరిస్తుందో! స్థిరమైన వెలుగుకు సర్వశక్తిమంత మైన నిస్సంగత్వ స్థితికి ఎంతగా చోటిస్తూ సర్వ విధ ఆరాటమూ సమసిపోతుందో!

సమస్త అనిశ్చితత్వాల నుండి బయటపడటానికి, సమస్త సంకుచితత్వం నుండి తప్పించుకొనడానికి, జీవనశ్వాసను పరిశుద్ధ ఆరోగ్యకర వాయువుతో నింపడానికి, నిరుపయోగ చీకాకును వదలించుకొనడానికి, మోయలేని భారాల నుండి విముక్తు డయ్యేందుకు, చేరుకొని తీరవలసినంత మహిమాన్వితమైన ఏకైక గమ్యం వైపు వేగంగా పరుగుపెట్టగల విధంగా, నీతో సదా సంపర్కంలో వుంటూ జీవించడమే ఓ ప్రభూ! నీవు సంకల్పించినదానినే సంకల్పించడమంటే! నీ దివ్యధర్మం యొక్క విజయం అంటే, అదే!

మూలం; శ్రీమాత

అనువాదం :కవితారెడ్డి

జీవన-విజ్ఞానం

తనను తాను తెల్సుకోవడం కోసం నియంత్రణలో ఉంచుకోవడం కోసం:

లక్ష్యం లేని జీవితం వ్యధాభరిత జీవనం. మీలోని ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలి. కాని నీ జీవితలక్ష్యం యొక్క నాణ్యత మీద నీ జీవితం యొక్క నాణ్యత ఆధారపడి ఉంటుందన్నది మర్చిపోకూడదు

నీ లక్ష్యం ఉన్నతము, విశాలము, ఉదారము, నిష్పక్షపాతమైనదిగా ఉండాలి. అప్పుడు నీ జీవితం నీకూ, ఇతరులకు కూడా విలువైనదిగా అవుతుంది.

కాని నీ ఆదర్శం ఏదైనా, దాన్ని నీలో సిద్ధింపజేసుకొన్నప్పటికీ, నీవు పరిపూర్ణంగా నీలో సమన్వయాన్ని సాధిస్తే తప్ప అది జీవితంలో పరిపూర్ణంగా వాస్తవం కాలేదు.

అస్తిత్వం యొక్క పరిశుద్ధత, ఏకీకరణ

నీలో సమన్వయాన్ని సాధించడానికి నీ మొదటి అడుగు, నీ గురించి, నీ అస్తిత్వంలోని వివిధ భాగాల గురించి, వాటి కార్యకలాపాల గురించి ఎరుక కల్గి ఉండడం. నీవు నీ లోని ఈ భిన్న భాగాలను, విడివిడిగా గమనించడం నేర్చుకోవాలి. అప్పుడే నిన్ను కార్యాచరణకు ప్రోద్బలం చేసే నీలోని ప్రేరణలు, ప్రతిచర్యలు, సంఘర్షణాత్మక సంకల్పాల యొక్క కదలికల మూలాలను స్పష్టంగా తెలుసుకోగలవు. అది చాలా సహనాన్ని, నిజాయితీతో కూడిన కఠినమైన పరిశీలనను కోరుతుంది. మానవ స్వభావం ముఖ్యంగా మనోప్రవృత్తి తన ప్రతి ఆలోచనను, భావాలను సమర్థించుకునే సహజ ప్రవృత్తి కల్గి ఉంటుంది. ఈ కదలికలను చాలా జాగ్రత్తగా పరిశీలించడం, వాటన్నింటిని యధాతథంగా ఆ సర్వోత్కృష్ట ధర్మాసనం ముందు నిలిపి, నిజాయితీతో దాని తీర్పును స్వీకరించగలిగినప్పుడే, మనలో మళ్ళీ ఎప్పుడు అవే పొరపాట్లు చేయని ఒక వివేకం మనలో రాగలదని ఆశించగలం. మనం నిజంగా అభివృద్ధి చెందాలని ఆశిస్తే, మన అస్తిత్వం యొక్క నిజతత్వాన్ని తెల్సుకోగల సమర్థతను పొంది ఉంటే, అంటే మనం ఎందుకు సృష్టించబడ్డాం, ఈ పృథ్వి మీద మనం సాధించవలసిన కార్యం ఏమిటన్నది తెల్సుకోడానికి ప్రయత్నం చేయగలం. అప్పుడు మనం క్రమం తప్పకుండా, ఎల్లవేళలా అప్రమత్తతతో మనలోని ఆ సత్యాన్ని వ్యతిరేకించే లక్షణాలని, తిరస్కరించడం కాని, తొలగించడం కాని చేయాలి. క్రమంగా

అన్ని భాగాలను, అస్తిత్వంలోని అన్ని స్థితులను క్రమబద్ధం చేసి, మన చైత్య కేంద్రం చుట్టూ సజాతీయమైన మొత్తంగా వ్యవస్థీకరించవచ్చు. ఈ సమన్వయాన్ని కొంత వరకైనా సాధించాలంటే చాలాకాలం పడుతుంది. అందుకని దానిని సాధించడానికి మనం ఓర్పును, సహనాన్ని ఆయుధాలుగా ధరించి, మన కృషితో విజయం సాధించడానికి, ఆ లక్ష్యాన్ని చేరడానికి అవసరం ఉన్నంతవరకు ఈ జీవితాన్ని పొడిగించాలన్న నిశ్చయంతో ఉండాలి.

బాహ్య అస్తిత్వపు పరిపూర్ణత

ఈ పరిశుద్ధతను, ఏకీకరణను సాధించడం కోసం పడే శ్రమతోపాటు, నీ అస్తిత్వంలో భాగమైన బాహ్య అస్తిత్వాన్ని కూడా జాగ్రత్తగా, పరిపూర్ణత కోసం సరిదిద్దుకోవాలి. ఉన్నత సత్యం అభివ్యక్తమౌతున్నపుడు తనను తాను వ్యక్తం చేసుకోవాలని కాంక్షిస్తున్న భావానికి గల క్రియాశక్తిని స్పష్టతను పదిలపరచే ఒక ఆలోచనా రూపాన్నివ్వగల మృదువైన, సమృద్ధమైన మనస్సునది నీలో కనుగొనాలి. ఈ ఆలోచనను మళ్ళీ మాటలలోకి పొందుపరచడానికి ఎదురుచూస్తున్నపుడు, ఆ మాటల అభివ్యక్తిలో నీ ఆలోచనను వక్రీకరించకుండా, ప్రకటించగల శక్తి నీలో ఉందా అని చూస్తుంది. ఆ సత్యాన్ని రూపొందించి సూత్రబద్ధం చేసిన ఆ మాటలు, నీ సంవేదనలలో, నీవు సంకల్పించిన క్రియాచరణలో, నీ చర్యల్లో, నీ అస్తిత్వ కదలికల్లో అభివ్యక్తం కావాలి. చివరికి నిరంతర కృషితో ఆ కదిలకలన్నీ స్వయంగా ఒక ఉన్నతమైన పరిపూర్ణతను పొందాలి.

ఇదంతా, నాలుగు విధాలుగా రూపొందించిన ఒక క్రమశిక్షణ ద్వారా సాధించవచ్చు. దానికి సంబంధించిన సామాన్య, సూత్రాలను ఇక్కడ వివరించాం. ఈ క్రమశిక్షణలో నాలుగంశాలు దేనికవి విడివిడిగా ఉండవు. అన్నీ ఒకేసారి అనుస రించవచ్చు. నిజానికిలాగే చేయాలి..

చైత్య-ను ఆవిష్కరించడం

ఇందులో మొదటి అంశం, చైత్యను క్రమబద్ధం చేయడంగా చెప్పవచ్చు. మనం 'చైత్య' అన్న పేరుతో పిలుస్తున్నది, మన అస్తిత్వపు, అంతరాత్మ ప్రభావిత కేంద్రం. అది మన అస్తిత్వపు ఉన్నత సత్యానికి మనలోగల పీఠం. అది ఆ సత్యాన్ని

తెల్సుకుని దాన్ని క్రియోన్ముఖం చేస్తుంది. అందువల్ల మనలో దాని ఉనికి ఎరుకను పొందడం, అది మనకు ఒక సజీవ వాస్తవంగా మారి, మనం దానితో తాదాత్మ్యం చెందగలిగే వరకు, ఈ సన్నిధి పై ఏకాగ్రత నిలుపడం మనకు అత్యంత ప్రధాన విషయం.

భిన్న కాలాల్లో, ప్రదేశాల్లో ఈ గ్రాహ్యతను సిద్ధింపచేసుకుని, చివరికి దానితో తాదాత్మ్యం సాధించడానికి అనేక పద్ధతులు చెప్పబడ్డాయి. కొన్ని పద్ధతులు మనస్తత్వానికి సంబంధించినవి, కొన్ని మతపరమైనవి, కొన్ని యాంత్రికమైనవి. నిజానికి ప్రతి ఒక్కరు వారి కనుగుణమైనదానిని వారు స్వీకరించాలి. గాఢమైన చెదరని ఆకాంక్ష, చైతన్యవంతమైన స్థిరసంకల్పం — బాహ్యంగా పఠనం, అధ్యయనం ద్వారా, అంతరంగంలో ఏకాగ్రత, ధ్యానం, వివేకోదయం, అనుభవం ద్వారా — ఆ లక్ష్యం చేరడానికి అవసరమైన ఏదో ఒక సహాయం అతను పొందగలుగుతాడు. అయితే ఒక్కటి మాత్రం ఉండి తీరాల్సిన విషయం, దాన్ని కనుక్కోవాలన్న సంకల్పం. ఈ కనుక్కోడం, సాక్షాత్కరింపచేసుకోడంలోనే మన అస్తిత్వం ప్రధానంగా నిమగ్నమై ఉండాలి. అమూల్యమైన ఆ గొప్ప ముత్యాన్ని మనం ఎలాగైనా దక్కించుకోవాలి. నీవేం చేస్తున్నా, నీ వృత్తి, వ్యాపకాలు ఎలాంటివైనా, నీ అస్తిత్వం యొక్క సత్యాన్ని కనుక్కొని దానితో ఐక్యత పొందాలన్న సంకల్పం ఎల్లప్పుడూ సజీవంగా, నీ ఆచరణలు, నీ స్పందనలు, నీ ఆలోచనల వెనకాల ఉండాలి.

మనస్సు — అభివృద్ధి (మానసిక పురోగతి)

అంతరంగపు ఈ ఆవిష్కరణోద్యమానికి దోహదం చేయడానికి, మనోవికాసాన్ని నిర్లక్ష్యం చేయకపోవడం మంచిది. ఎందుకంటే మనస్సనే పనిముట్టు గొప్ప సహాయకారి లేదా గొప్ప అవరోధం కాగలదు. దాని సహజస్థితిలో మానవమనస్సు ఎల్లప్పుడు పరిమితమైన దృష్టి కలిగి ఉంటుంది. అర్థం చేసుకోడంలో సంకుచితమై, భావాల్లో మొండివైఖరితో ఉంటుంది. అందుకే దానిని మరింత విశాలమైన మృదువైన, నిశితమైన సాధనంగా చేయాలంటే నిరంతరం కృషి చేయాలి. అందువల్ల కుదిరినంత వరకు ప్రతి విషయాన్ని అనేక కోణాల్లోంచి చూడవలసిన అవసరం ఉంది. దీన్ని సాధించడానికి ఆలోచనకు గొప్ప మృదుత్వాన్ని, ఉన్నతిని కలుగజేసే ఒక శిక్షణా విధానం ఉంది. అది ఈ క్రింది విధంగా ఉంటుంది. ఒక స్పష్టమైన సిద్ధాంతాన్ని తయారుచేసి,

దాని కెదురుగా దాన్ని వ్యతిరేకించే సిద్ధాంతాన్ని అంతే కచ్చితత్వంతో రూపొందించడం. ఆ తరువాత ఆ రెండింటిని గురించి జాగ్రత్తగా చింతన చేసి, ఆ సమస్యకు సమ న్వయం కుదిరేవరకు విస్తృతపరచాలి, లేదా అధిగమించాలి. ఆ సమన్వయం ఆ రెండు విరుద్ధతలను ఐక్యం చేయగల విస్తృత, ఉన్నత, మరియు సర్వతోముఖమైన భావన నిస్తుంది.

ఇదే రకమైన అనేక శిక్షణ లున్నాయి. వాటితోను సాధన చేయవచ్చు. కొన్ని మన స్వభావం మీద కూడా ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతాయి. అందువల్ల వాటికి రెండు రకాలుగా ప్రయోజనం ఉంది. అంటే మన మనసుకు శిక్షణ నిచ్చి, తద్వారా మన సంవేదనలపై, పర్యవసానంపైన నియంత్రణను విధించగల స్థితిని పొందడం. ఉదాహరణకు మనుషుల గురించి, విషయాల గురించి నీ మనసు తీర్పు ఇవ్వడాన్ని ఎన్నడూ ఒప్పుకోకూడదు, ఎందుకంటే మనసు జ్ఞానంతో కూడిన పరికరం కాదు. జ్ఞానాన్ని తెల్సుకోగల సమర్థత దానికి లేదు. అందుకే అది జ్ఞానం వల్ల నడపబడాలి. జ్ఞానం మానవుల మానసికస్థితి కన్న చాలా ఉన్నత స్థాయికి చెందినది. శుద్ధ యోచనాసీమలకు పైన ఉంటుంది. ఆ పైనించి వచ్చే జ్ఞానాన్ని అందుకోవాలన్నా, దాన్ని అభివ్యక్తం చేయాలన్నా ఆ మనసు నిశ్శబ్దంగా ఉండాలి. అది రూపకల్పన, వ్యవస్థీకరణ, మరియు క్రియాచరణ చేసే సాధనం. ఈ కార్యాచరణ లోనే దాని పూర్తి విలువను, నిజప్రయోజనాన్ని సిద్ధింపచేసుకుంటుంది.

మరో రకమైన అభ్యాసం ఉంది. అది చైతన్యం యొక్క అభివృద్ధికి చాలా సహాయపడుతుంది. ఏ విషయంలోనైనా అంగీకారం కుదరనప్పుడు, అంటే ఒక నిర్ణయం తీసుకోవడానికో, లేదా ఒక పనిచేయడానికో, మనం మరెవ్వరి ఉద్దేశ్యాలను గ్రహించకుండా గుడ్డిగా, మనకే తెలుసునన్న భావంలో మూసుకుపోయి ఉండకూడదు. దానికి బదులుగా మనం ఎదుటివారి ఉద్దేశ్యం తెలుసుకుందుకు కృషి చేయాలి, మనం ఎదుటి వ్యక్తి స్థానంలో ఉండి ఆలోచించాలి. అప్పుడు వాదులాటలు, కొట్లాటలు లేకుండా ఇరువర్గాల వారికి, సాధ్యమైనంతవరకు ఆమోదయోగ్యమైన పరిష్కారం దొరుకుతుంది. మంచిసంకల్పం ఉన్నవారికి ఏదో ఒక పరిష్కారం ఎప్పుడూ ఉంటుంది.

ప్రాణికశిక్షణ (ప్రాణికశక్తి)

ఇక్కడ మనం ప్రాణికం యొక్క శిక్షణ గురించి చెప్పాల్సి ఉంది. మనలోని ప్రాణికసత్తా, ప్రేరణలకు, కోరికలకు, మరియు హింసకు, క్రియాశీలమైన చైతన్యానికి, నిస్పృహ, నిరాశలకు, తీవ్రవాంఛలకు, ప్రతిఘటనలకు పీఠాధిపతి. అది ప్రతిదాన్ని కార్యోన్ముఖం చేయగలదు, నిర్మించగలదు, సాక్షాత్కరింపచేయగలదు. అయితే అది అన్నింటిని నాశనం చేయగలదు, మట్టుపెట్టగలదు. మనిషిలోని ఈ భాగాన్ని శిక్షణలో పెట్టడం చాలా కష్టం. సుదీర్ఘ మైన శ్రమతోపాటు, గొప్ప సహనం, సంపూర్ణ నిజాయితీతో కూడిన కృషి అవసరం. నిజాయితీ లోపిస్తే ప్రారంభంలోనే మోసపోతావు, అప్పుడు అభివృద్ధి కోసం పడిన శ్రమంతా వృధా. ప్రాణికం సహకరిస్తే ఏ సాక్షాత్కారమూ అసంభవం కాదు, ఆచరణసాధ్యం కాని ఏ పరివర్తన ఉండదు. అయితే కష్టమంతా దాని 'నిత్య సహకారం' పొందడంలోనే ఉంది. ప్రాణికం మంచి పనిముట్టు, కాని ఎక్కువగా స్వీయతృప్తినే వెతుక్కుంటుంది. దాన్ని కొంచెం కాని, ఎక్కువగా కాని తిరస్కరిస్తే విసుగుచెంది, ముఖం మాడ్చుకుని, సమ్మెకు దిగుతుంది. ఒక్కసారి దాని శక్తంతా అంతరించిపోయి, దాని స్థానంలో మనుషుల పట్ల, వస్తువుల పట్ల చిరాకు, నిరుత్సాహం, తిరస్కారం, నిరాశ, అసంతృప్తి వచ్చి చేరతాయి. అలాంటి సమయాల్లో నెమ్మదిగా ఉండడం, ఏ పనీ చేయకుండా ఉండడం మంచిది. ఎందుకంటే ఇలాంటి క్షణాల్లోనే మనం తెలివితక్కువ పన్లు చేస్తాం. నెలల తరబడి కష్టపడి సాధించిన ప్రగతిని ఒక్క క్షణంలో నాశనం చేసుకుంటాం, లేదా చెడగొట్టుకుంటాం.

ఎవరైతే వారి చైత్యపురుషతో సంపర్కం స్థిరంగా కలిగి ఉంటారో, అది వారిలోని ఆకాంక్షను నిరంతరం జ్వలింపజేస్తూ, ఆ చైతన్యం యొక్క ఆదర్శాన్ని సాక్షాత్కరింప చేస్తుంది. ఆలాంటివారికి ఈ పైన చెప్పిన సంక్షోభాలు ఎక్కువ సమయం ఉండవు, తక్కువ అపాయకరంగా ఉంటాయి. ఈ చైతన్యం సహాయంతో వారు ప్రాణికంకు, తిరుగబడే పిల్లవాడికి నచ్చచెప్పే విధంగా సహనంతో, ఓర్పుతో, దానికి సత్యాన్ని, ప్రకాశాన్ని దర్శింపచేస్తూ దాన్ని దారికి తెచ్చే ప్రయత్నం చేస్తూ, కొంతకాలంగా తెర వెనుకనున్న మంచి సంకల్పాలకు దాన్ని మేల్కొల్పుతారు. ఆ విధమైన ఓర్పుతో కూడిన జోక్యం వలన ప్రతి సంక్షోభం, మరొక నూతన అభివృద్ధిగా మారుతుంది, లక్ష్యం వైపు మరో అడుగు వేస్తాం. అభివృద్ధిని నిదానంగా

నైనా సాధించవచ్చు, మళ్ళీ మళ్ళీ పూర్వస్థితికి దిగజారవచ్చు. ధైర్యంతో సంకల్పం వీడకుంటే, ఎవరికైనా ఏదో ఒక రోజు విజయం తప్పదు. ఆ సత్య-చైతన్య ప్రకాశంలో అన్ని కష్టాలు కరిగిపోయి, మాయమౌతాయి.

శారీరక లేక దైహిక విద్య

చివరిగా, హేతుబద్ధమైన, వివేచనగల దైహికవిద్య ద్వారా మనం మన శరీరాన్ని మృదువుగాను, ధృడంగాను తయారుచేసుకోవాలి. అది భౌతికప్రపంచంలో మన ద్వారా అభివ్యక్తమయ్యే సత్యశక్తికి ఒక అర్హతగల సాధనంగా ఉండాలి. నిజానికి శరీరం పెత్తనం చేయకూడదు. అది విధేయత కలిగి ఉండాలి. సహజంగానే అది విశ్వాసపాత్రమైన, అణకువగల సేవకురాలు. దురదృష్టవశాత్తు దానికి, దాని యజమానులైన మనసు, ప్రాణికాలకు సంబంధించి వివేచన చేయగల సమర్థత అరుదుగా ఉంటుంది. తన స్వసుఖాన్ని వదులుకుని, అది వారికి గుడ్డిగా విధేయత చూపుతుంది. మనసు తన సిద్ధాంతాలతోటి, తన మొండి, నిలకడలేని నియమాలతోటి, ప్రాణికం తన తీవ్ర ఇచ్ఛలు, వాటి విజృంభణలు మరియు వాటి దుర్వ్యయంతోటి, త్వరలోనే ఆ శరీర సహజ సంతులనాన్ని చెడగొట్టి అందులో, అలసట, నిస్సత్తువ, అనారోగ్యం సృష్టిస్తుంది. ఈ నిరంకుశత్వం నించి అది స్వేచ్ఛను పొందాలంటే, అది నిరంతరం తన అస్తిత్వ చైతన్య కేంద్రంతో ఐక్యత చెంది ఉండాలి. శరీరానికి, దేన్నైనా అనుకూలంగా మలుచుకుందుకు, సహనశక్తికి అద్భుతమైన సమర్థత ఉంది. మనం ఊహించేదానికన్న ఎన్నో రెట్లు సామర్థ్యం, యోగ్యత కలది. దాన్నిప్పుడు పాలించే ఈ అజ్ఞానమైన, నిరంకుశమైన యజమానులకు బదులుగా, అది తన అస్తిత్వ కేంద్రమైన సత్యం చేత పాలించబడితే, దాని శక్తిసామర్థ్యాలు మన కాశ్చర్యం కల్గిస్తాయి. ప్రశాంతంగా, నిశ్చలంగా, ధృఢంగా, స్థిరంగా ఉండి, ప్రతి క్షణం తన నుంచి ఆశించిన కృషిని చేయగలిగే సమర్థతనది పొంది ఉంటున్నది. అప్పుడది కర్మ చేస్తూనే విశ్రాంతిని పొందడం, తేరుకోవడం, మళ్ళీ విశ్వశక్తుల సంపర్కంతో శక్తిని పుంజుకోవడం నేర్చుకుంటుంది. తన శక్తుల్ని ఎరుకతో, పొందికగా ఖర్చు చేస్తుంది. ఈ ధృఢమైన, సమరసమైన జీవితంలో ఒక నూతన సామరస్యత దేహంలో అభివ్యక్తమౌతుంది. అది ఆ ఉన్నతస్థితులలోని సామరస్యతను ప్రతిబింబింప చేస్తుంది. పరిపూర్ణ సౌష్టవంగల, చక్కటి సౌందర్యవంతమైన రూపాన్నిస్తుంది. ఈ సామరస్యత

అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఎందుకంటే అస్తిత్వం యొక్క సత్యం ఒక చోట నిలిచిపోదు, అది ఎదుగుతున్న పరిపూర్ణత్వం, అది మరింత సంపూర్ణము, సర్వతో ముఖమూ అయిన నిరంతర వికాసం. ఈ ప్రగతిశీలమైన సామరస్యత వైపు కదలికను, ఈ శరీరం అనుసరించడం నేర్చుకున్నప్పుడు ఈ శరీరం నాశనం, విచ్ఛిన్నతల ఆవశ్యకతలను నిరంతర పరివర్తనా పద్ధతి ద్వారా తప్పించుకోడం సాధ్యం కావచ్చు. అప్పుడు మృత్యువు యొక్క నిరంకుశ ధర్మాని కిక్కడ తావుండదు.

సత్యం యొక్క చతుర్విధ అభివ్యక్తి

మన లక్ష్యమైన ఈ స్థాయి పరిపూర్ణతకు మనం చేరుకున్నపుడు మనం అన్వేషిస్తున్న ఈ సత్యం యొక్క నాలుగు ముఖ్య అంశాలు — దివ్యప్రేమ, దివ్యజ్ఞానం, దివ్యశక్తి మరియు దివ్యసౌందర్యాలు — సత్యం యొక్క ఈ నాలుగు 'భూషణాలు' మన అస్తిత్వంలో తమంతట తాముగా అప్రయత్నంగా వ్యక్తమౌతాయి. సత్యమైన, పవిత్ర ప్రేమకు చైత్యం, వాహికగా ఉంటుంది. మనసు నిర్దిష్టమైన జ్ఞానానికి వాహికగా ఉంటుంది. ప్రాణికం అజేయమైన శక్తిని, ధృఢత్వాన్ని అభివ్యక్తం చేసేదిగా ఉంటుంది. శరీరం సంపూర్ణమైన పొందికగల సమగ్ర సౌందర్యానికి వ్యక్త రూపంగా ప్రకాశిస్తుంది.

*

ప్రశ్న: 'మన్ని మనం తెల్సుకోవడం, స్వయం నియంత్రణలో ఉండడం' దీని అర్థం ఏమిటి?

దీని అర్థం మన అంతరంగ సత్యానికి మనం ఎరుకతో ఉండడం, మన అస్తిత్వంలోని వివిధ భాగాలకు, వాటి, వాటి విధుల నిర్వహణకు అప్రమత్తంగా ఉండడం. నీవు ఏ ఏ పనులు ఎందుకు చేస్తున్నావో నీకు తెలిసి ఉండడం. నీ ఆలోచనలు నీకు తెలియాలి. ఆలాగే నీ కార్యకలాపాలన్నీ, నీ కదలికలు, నీవు ఏది చేయగల సమర్థతను పొంది వున్నావో... ఇలాంటివన్నీ. తన్ని తాను తెల్సుకోడం ఒక్కటి సరిపోదు. ఆ జ్ఞానం నిన్ను నీవు నియంత్రించుకోగలిగే ఎరుకగల శక్తి నివ్వాలి. మన్ని మనం పరిపూర్ణంగా తెల్సుకోవడం, మనపై మనకు పరిపూర్ణ నియంత్రణ కలిగి ఉండడం కోసం.

కాని దాన్ని పొందడానికి ప్రతి క్షణం ఆకాంక్షతో ఉండాలి.

దాన్ని ప్రారంభించడానికి వెనక ముందులు, వయసు తారతమ్యాలు లేవు.

అంటే నీవు చాలా చిన్నవయసులో ఉన్నప్పుడే, నిన్ను నీవు అధ్యయనం చేయడం ప్రారంభించి, నిన్ను నీవు తెల్సుకుని, క్రమంగా నీపై నీవు నియంత్రణ సాధించవచ్చు. నువ్వు 'ముసలితనం' అనబడే స్థితిలో ఉన్నా, వయసు పైబడినా, సమయమైనా, ఆ కృషి చేపట్టి, నిన్ను నీవు మరింత బాగా తెల్సుకుందుకు, మరింతగా నిన్ను నీవు నియంత్రణలో ఉంచుకుందుకు ప్రయత్నించవచ్చు. ఆలస్యం అన్న మాట లేదు. ఇదే విజ్ఞానంతో కూడిన జీవితం, జీవన విజ్ఞానం.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఇచ్ఛను సమర్పించే విధానం

"ఒక బండరాయిలాగా జడపదార్థమైపోయే ఉదాసీన సమర్పణ కాదు నీ నుంచి ఆశించేది, నీ ఇచ్ఛను దైవేచ్ఛ అధీనంలో ఉంచటమే కావాలి"

ప్రశ్నలు – సమాధానాలు 1929 (21 ఏప్రియలు)

ఒక వ్యక్తి తన ఇచ్ఛను ఏ విధంగా సమర్పించగలడు?... కొంతమంది, తమ ఇచ్ఛను సమర్పించినప్పుడు, ఇక తాము ఇచ్ఛగించడం మానివేస్తారు! వారికది చాలా అనుకూలంగా ఉంటుంది, కాని అది సరియైన పద్ధతి కాదనేది సుస్పష్టం.

దైవేచ్ఛ ఏదో తెలియనప్పుడు ఒక వ్యక్తి తన ఇచ్ఛను ఏవిధంగా దైవానికి సమర్పించగలడు? ఇది చాలా కుతూహలమైన సమస్య.

సాధకుడు: కొంతమంది మనుషులు బాహ్యం నుంచి తమకు వచ్చే సమస్తమూ దైవేచ్ఛగా అనుకుని, దానినంతా ఆ విధంగానే స్వీకరిస్తారు.

అవును, దురదృష్టవశాత్తు అది ఆ విధంగానే ఉంటుంది. కాని వారు స్వీకరించేదంతా సమిష్టి ఇచ్ఛనూ లేదా ధృఢచిత్తుల ఇచ్ఛనూ మాత్రమే.

సాధకుడు: ఒక వ్యక్తి తన ఇచ్ఛతో చేసే పనులన్నింటినీ దైవానికి సమర్పించ కూడదా? అనగా, మొదట తాను ఇచ్ఛగించిన పనులను కావించి, పిమ్మట వాటిని సమర్పించకూడదా?

ఒక వేళ మొదట నీ ఇచ్ఛను నిశ్శబ్దపరచి, అంతరంగవాణికై నిరీక్షించగలిగితే! అది వివేకవంతమైన పని.

పరికించి చూస్తే, దైవానికి మన ఇచ్ఛను సమర్పించటానికి ఇప్పటికే మనం ఎన్నో దారులను కనుగొన్నాం: మొదటిది, దేనినీ ఇచ్ఛగించకపోవటం! రెండవది, తాను కోరుకునేది కాకుండా అందరూ కోరుకునేదానిని చేయడం! మూడవది, దేనినైనా కోరుకోవడం, దేనినైనా చేయడం, ఆ తరువాత తాను చేసినదానిని దైవానికి అర్పించడం!

కాని ఒక వ్యక్తి తనకు తాను ఇచ్ఛను ఏర్పరుచుకుని, దానిని తన ఉన్నతాదర్శం ముందు శోధన తెరపై ఉంచడానికి ప్రయత్నం చేస్తూ, ఆ ఆదర్శం సమక్షంలో అది ఏవిధంగా ఉందో, సరిగా రూపుదిద్దుకున్నదా లేదా అనే దానిని పరిశీలించవచ్చు. అది తటపటాయింపుతో ఊగిసలాడి ఏమాత్రం సందేహాస్పదమైనా అక్కడ ఏదో ఉందని దానిని పరీక్షించి సరిచూసుకోవాలనే విషయం నీకు నిశ్చయంగా తెలుస్తుంది. అలా కాక, అది చాలా ప్రశాంతంగా ఆ తెర ముందు నుంచి ఏ విధమైన అడ్డమూ లేకుండా సాగిపోయి అంగీకారయోగ్యమైనదైనట్లైతే, నీవు చేయదలచుకున్నది సాహసించి చేసి ఫలితం కోసం చూడవచ్చు. కాని ఇక్కడ కూడా మనం చాలా ఇబ్బందికరమైన సమస్యను ఎదుర్కొంటాం.... అంతరంగ ప్రశాంతతలో ఉండిపోవాలనుకునేవాళ్ళు ఏమి జరిగినా అది అంతా దైవేచ్ఛ వలనే నని చెప్తారు — ప్రశాంతంగా ఉండాలనుకునేవారికి ఇది చాలా అత్యుత్తమమైన పద్ధతి, దానిని మించింది మరొకటి లేదు; ఒకవేళ ఉంటే, అది చాలా కష్టతరం. కనుక, ఒక వేళ నీ ఇచ్ఛ వ్యతిరేకించబడితే, అప్పుడు నీవు దానిని దైవేచ్ఛ అంటావు; నీవు నీ ప్రశాంతతతో, చేయగలిగింది చేస్తావు, ఫలితం నీవు ఊహించినదానికి భిన్నంగా ఉంటుంది, నీవు ప్రశాంతస్థితిలో ఉంటావు (ఇదేమంత తేలికైన విషయం కాదు; ఇది చాలా మంచి పద్ధతే, కాని ఇది మాత్రమే కాదు). కానీ నీ ఇచ్ఛ పరిస్థితుల ననుసరించి వ్యతిరేకించబడవచ్చు, అయినప్పటికీ అది సరియైనది కావచ్చు. అప్పుడు పరిష్కారం చాలా చాలా కష్టమౌతుంది. మొదటి విషయం, అది సరియైనదేనని ఎలా తెలుసుకోవటం... నీవు ఏ పక్షపాతమూ లేనివాడవైతే, నిలకడగా, ప్రశాంతంగా, ఎంత వీలయితే అంత తక్కువ అహంతో, దానిలో ఏమి జరిగిందో సరాసరిగా చూసినపుడు ఒక వెలుగు, దానిలో నుండి బయటకు పోయిందనే ఒక విధమైన భావవైరుధ్యం కన్పించి, నీవు అసత్యం సన్నిధిలో ఉన్నట్లనిపిస్తుంది, అయినా నీవు ప్రశాంతంగానే ఉంటావు, కాని ఏదో తెలియని కారణాన నీ ఇచ్ఛ వ్యతిరేకించబడిందనే విషయాన్ని చూసి,

అర్థం చేసుకుని, అది అసత్యం కానప్పటికీ, నీవు చూసింది సత్యమేనని, కానీ ఏదో ఒక కారణంగా అది అభివ్యక్తం కాలేకపోయిందనే విషయాన్ని తెలుసుకుంటావు. కనుక, నీవు ఇచ్ఛగించిన సత్యం ఎందుకు అభివ్యక్తం కాలేదనే కారణాన్ని తెలుసుకునే సాహసయాత్రకు శ్రీకారం చుట్టాలి. ఈ సమస్య కొంత బాగా ఎక్కువగా క్లిష్టమైనది... కాని నీవు ఉన్నతంగానూ, విస్తృతంగానూ విప్పారిన దృష్టితో తేరిచూస్తే, నీ ఇచ్ఛ వాస్తవరూపం దాల్చివుంటే, ఎటువంటి పర్యవసానాలను అది పొంది వుండేదో, తక్షణం చూడటంతోపాటుగా, దాని వలన జరిగే పర్యవసానాలను సైతం చూస్తావు. నీవు మరింత దూసుకుపోయి ఇంకా దూరానికి నీ దృష్టిని సారించితే, నీ ఇచ్ఛ ఎంతగా నిజమైనప్పటికీ అది పాక్షిక సత్యమనే విషయాన్ని చూడగలుగుతావు — అది సమిష్టి, సర్వసాధారణ సత్యం కాదు, మీదు మిక్కిలి సార్వజనీన సత్యమూ కాదు — ఇంకా చెప్పాలంటే, ఆ సత్యం ఆ క్షణంలో వాస్తవమై ఉంటే ఒక సమిష్టి సమీకరణాన్నీ, దైవప్రణాళికలో భాగమయ్యే ఎన్నో విషయాలనూ అస్తవ్యస్తతకు గురిచేసి ఉండేది (వాస్తవానికి, ప్రతిదీ దైవకార్య ప్రణాళికలో భాగమే, సృష్టి సమస్తమూ, బ్రహ్మాండమంతా): ఆ విధంగా మొత్తం లోని ఒక భాగం వెనుకబడిపోతుంది.

లోకులెప్పుడూ అడుగుతుంటారు, "దైవం సర్వశక్తివంతుడు కదా, అటువంట ప్పుడు విషయాలేవీ ఇప్పటికీ ఎందుకు మారడం లేదు?". దాని కారణం ఇది.

బాగా గుర్తుంచుకోవలసిన విషయం, నీ అభిప్రాయం ప్రకారం అదంతా ఏ విధంగా ఉండాలని అభిలషిస్తున్నావో, అది దైవనిర్ణయానుసారం ఏ విధంగా ఉండవలసి ఉందో, అటువంటి దానికి అనంత దూరంలో ఉంటుంది, ఈ వాస్తవికత ననుసరించి, అది ఏ విధంగా సాధ్యమవుతుందో పూర్తిగా నీవు ప్రయత్నపూర్వకంగా చూడటం తటస్థించినా, నీవు విశ్వంలో అధిక భాగాన్ని వదిలివేసిన వాడివవుతావు. అది పూర్తిగా సమాంతర సాక్షాత్కారానుభవం మాత్రమే, ఏ విధంగా చూసినా అది చాలా స్వల్పమై, చాల హ్రస్వమై, విశ్వంలోని అధికతర భాగాన్ని ఇంతకు ముందు ఏ విధంగా ఉందో అదే విధంగా ఉంచుతుంది. ఒక వేళ సమస్తం మీద నీకు బహువిస్తృత మైన దృష్టి ఉంటే, ఒక వేళ సమస్తాన్నీ ఇంకా ఎక్కువగా నీ పరిధిలోనికి తెచ్చుకోగలి గితే, తయారుగా ఉన్న నీ మార్గంలో నీవు ముందుకు వెడితే — జీవులతో ఏ విధంగా ఉంటుందో మార్గాలతోటీ అది అదే విధంగా ఉంటుంది. కొన్ని దానికి తయారుగా ఉంటాయి — ఇతరుల కోసం నిరీక్షించే ఓరిమి అనేది లేక, అనగా

ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితులతో పోల్చి చూస్తే, నీవు నిజమైన మహాసత్యానికి అతి సమీపంగా సాక్షాత్కారాన్ని పొందాలనుకుంటే, ఏమవుతుంది? ఒక విధమైన ఐక్యతకు భ్రష్టత కలుగుతుంది, సామరస్యతకే కాకుండా, సమతౌల్యానికి కూడా విచ్ఛిత్తి కలుగుతుంది, ఎందువల్లనంటే సృష్టిలోని ఒక పూర్తి భాగం దానితోపాటుగా ముందుకు వెళ్ళలేకపోయింది. దీని ఫలితం పూర్తి దైవసాక్షాత్కారానికి బదులుగా, నీకు ఆ స్థాయికే పరిమితమైన సాక్షాత్కారం అణుమాత్రం సంభవిస్తుంది కాని, చిట్టచివరగా ఏమి జరగవలసి ఉన్నదో అది ఏమాత్రం సంభవం కాదు.

పర్యవసానంగా గ్రహించవలసినదేమంటే, నీవు అసహనానికి లోను కాకూడదు. నీవు దర్శించిన సత్యం తక్షణం వాస్తవరూపానికి రాలేదని ఆశాభంగం చెందడం, కుంగిపోవడం తగదు. సహజంగానే, చేసిన తప్పుకి దిగాలుపడ్డామా లేక దుఃఖిస్తున్నామా లేక నైరాశ్యంలో మునిగిపోయామా అనేది సమస్య కాదు, ఎందువల్లనంటే తప్పును దిద్దుకోవచ్చు; నీవు తప్పు జరిగిందని గ్రహించిన క్షణం నుంచి, నీవు అంతరంగంలో చేయవలసి ఉన్న మహత్ కార్యానికి పురోభివృద్ధి చెందడానికి, ఆనందంగా ఉండటానికి అవకాశం దొరికిందన్న మాటే! కాని పరిస్థితి అంతంకంటే చాలా చాలా గంభీరమైనది, దీన్ని అధగమించటం చాలా కష్టసాధ్యం, కారణం నీవు ఒక విధమైన సత్యాన్ని, సంపూర్ణమైన, ఆవశ్యకమైన సత్యాన్ని చూడటం తటస్థించింది. కాని ఈ సత్యం పరిపక్వమై వాస్తవికతను దాల్చే స్థితిలో విశ్వం లేదు. నేను ఇది ఎక్కువ మందికి అనుభవానికి వస్తుందని చెప్పడం లేదు. కానీ, బహుశా నీ అనుభవం లోనికి రావచ్చు, అప్పుడు నీవు తప్పనిసరిగా అత్యంత సహనాన్ని, గొప్ప గ్రాహ్యతను కలిగి, నీకు నీవు, "అవును, అది నిజమే, కాని అది పూర్తి సత్యం కాదు" అని చెప్పుకోవాలి; అనగా, అది మీదు మిక్కిలి, ఇప్పుడున్న సాధ్యాసాధ్యాల సంభావ్యత ననుసరించి ఇతర సత్యాలతో సామరస్యత కలిగిన సత్యం కాదు; ఆ విధంగా మనం దాని వాస్తవికత చాలా తొందరగా జరగాలని ప్రయత్నించాం. మనం తొందరపడటం మూలంగా తప్పుడు అభిప్రాయం యేర్పడింది. కాని, అంతమాత్రాన దానిని అసత్యం అనవద్దు; దానిని అపరిణితి అని చెప్పు, నీవు చెప్పగలిగినదంతే — నీవు చూసింది సత్యం, కాని అది పరిణితిచెందింది కాదు, నీవు అవశ్యం ఎంతో ఓర్పుతో, పట్టుదలతో నీ స్వల్పసత్యాన్ని ప్రస్తుతానికి

జాగ్రత్తగా చెదరిపోకుండా కూడగట్టుకుని అది వాస్తవికతను సంతరించుకునేవరకూ వేచి ఉండాలి.

అంతిమ గెలుపు అత్యంత సహిష్ణునకే.

"నీవు, 'నా ఇచ్ఛను దైవానికి ఒసుగుతున్నాను.... దైవేచ్ఛ నా కొరకు దానిని నెరవేర్చు గాక' అని అంటావు. తప్పనిసరిగా నీ ఇచ్ఛ నిలకడగా నిరంతరంగా క్రియాశీలమవుతూనే ఉండాలి, ఏదో ఒక ప్రత్యేకమైన పనిని ఎంచుకోవటం లేదా దేనినైనా ఒక దానిని హక్కు భుక్తంగా కోరుకోవడం కాకుండా, హృదయ కుహరం నుంచి వచ్చిన ఆకాంక్షతో, ఏ లక్ష్యాన్ని చేరుకోవాలో దాని మీద ఏకాగ్రతతో ఉండాలి".

ప్రశ్నలు సమాధానాలు 1929 (21 ఏప్రియలు)

అక్కడ మన సమస్యకు పరిష్కారం ఉంది. నీవు ప్రతి నిమిషమూ ఆకాంక్షాపరంగా నీ ఇచ్ఛను బహుమతిగా చేయవచ్చును — ఆ ఆకాంక్ష దానికదే వినమ్రంగా రూపకల్పన చేసుకుంటుంది, అది ఏదో సామాన్యంగా "ప్రభూ, నీ ఇచ్ఛయే జరుగు గాక" అని కాకుండా "నేను చేయగలిగిందేదో దానినే శ్రేష్టంగా చేయగలిగేటట్లుగా అనుగ్రహించు ప్రభూ" అంటుంది.

ప్రతి క్షణమూ శ్రేష్టమైనదేదో చేయడం లేదా ఏ విధంగా చేయాలో తెలుసుకోవడం నీకు సాధ్యం కాకపోవచ్చు. కాని, శ్రేష్టంగా, శ్రేష్టమైన దానిని శక్తి మేరకు చేయడానికి నీ ఇచ్ఛను దైవం అధీనంలో ఉంచవచ్చు. దాని వలన దానిలో అద్భుతమైన ఫలితాలను చూస్తావు. దానిని చైతన్యంతోనూ, చిత్తశుద్ధితోనూ, పట్టుదలతోనూ చేయి, అది ఉవ్వెత్తుగా ఎగిసిపోవటాన్ని చూస్తావు. అది ఆ విధంగానే ఉంటుంది, కాదంటావా? ఏ వ్యక్తి అయినా దానిని తన ఆత్మనుంచి వచ్చే తీవ్రగాఢావేశంతో అవశ్యం చేయాలి, తన ఇచ్ఛయొక్క సంపూర్ణ ధృఢత్వంతో, ప్రతి నిమిషమూ శాయశక్తులా శ్రేష్టంగా చేయాలి, శ్రేష్టమైనదానిని శక్తి మేరకు చేయాలి. ఇతరులు ఏమి చేస్తారనేది నీకు అప్రస్తుతం — ఇటువంటి ఈ విషయాన్ని పలుమారులు తిరిగి తిరిగి నీకు వివరించి చెప్పలేను.

"ఫలానా, ఫలానావారు దీనిని చేయలేదు", "ఫలానా, ఫలానావారు మరేదో చేశారు", "తాము చేయగూడని పని చేస్తుంటారు" అనే మాటలన్నీ నీవు పట్టించుకోనవసరం లేదు. ఈ శరీరాన్ని ఎంత చైతన్యవంతం చేయగలిగితే అంతగా

చేయటానికీ, దానిని దైవానికి అత్యంత సమగ్రమైన, అత్యంత చైతన్యవంతమైన పనిముట్టుగా చేయడానికీ నీవు ఒక భౌతిక శరీరంలో, ఒక నిర్దుష్ట లక్ష్యంతో ఈ భూమి మీద ఉంచబడ్డావు. ఆయన నీ అన్ని క్షేత్రాలలోనూ నియమిత ప్రమాణంలో ద్రవ్యాన్నీ, నియమిత ప్రమాణంలో పదార్థాన్నీ ఇచ్చాడు — మానసికం, ప్రాణికం, భౌతికం — అవన్నీ ఆయన నీ నుంచి ఎంతగా ఆశిస్తున్నాడో అంత నిష్పత్తిలోనూ, నీ చుట్టుపక్కల పరిస్థితులన్నీ కూడా ఆయన నీ యొక్క ఏ స్థితిని ఆశిస్తున్నాడో అంత నిష్పత్తిలోనూ ఉన్నాయి. అటువంటప్పుడు, "నా జీవితం దుర్భరం, నేను ఈ ప్రపంచంలో అత్యంత దైన్యమైన జీవితాన్ని గడుపుతున్నాను" అని నీతో అనే వారందరూ గాడిదలు! ప్రతి వ్యక్తీ అతడి సంపూర్ణ పురోభివృద్ధికి సహాయం చేసే అనుభవాలను పొందుతాడు, ప్రతి వ్యక్తీ తన సంపూర్ణ సాక్షాత్కారానికి సహాయపడే కష్టాలను పొందుతాడు.

నిన్ను నీవు జాగ్రత్తగా తరచి చూసుకుంటే, ప్రతి వ్యక్తీ తనలో తాను సాక్షాత్కరించుకోవలసిన విశిష్టత్వానికి వ్యతిరేకమైనదానిని కలిగి ఉంటాడనే విషయాన్ని తెలుసుకుంటావు (నేను విశిష్టతను చాలా విశాలమైన, ఉన్నతమైన అర్థంలో వాడాను). నీ కొక ప్రత్యేక ధ్యేయం, ఒక ప్రణాళికతో నెరవేర్చవలసిన విధాయక కార్యం, నీకే సొంతమయిన ప్రత్యేక సాక్షాత్కారం ఉన్నాయి, అది ప్రతి వ్యక్తికీ ప్రత్యేకం, నీలో నీ సాక్షాత్కారం సమగ్రంగా ఉండటానికి అవసరమైన అన్ని ఇబ్బందులూ నీవు కలిగి ఉంటావు. ఎల్లప్పుడూ నీ లోపల ఛాయా, జ్యోతిప్రకాశమూ సమానంగా ఉన్నాయనే విషయాన్ని కనుగొంటావు: నీకు ఒక సమర్థత ఉంది, నీలో ఈ సమర్థతకు ఖండన కూడా ఉంది. కాని నీవు నీలో ఒక అత్యంత నల్లనైన బిలాన్నీ, ఒక మందపాటి నీడనూ కనుగొంటే, అప్పుడది కచ్చితంగా నీలో ఎక్కడో ఒక గొప్ప ప్రకాశం ఉందని తెలియజేస్తున్నదని గ్రహించుకో. ఒకదానిని ఎలా ఉపయోగించుకుని మరొక దానిని సాక్షాత్కరించుకోవడం తెలుసుకోవడం నీ మీద ఆధారపడి ఉంది.

దీనిని గురించి చాలా తక్కువ చెప్పబడింది, కాని ఇది చాలా అతిముఖ్యమైన విషయం. నీవు జాగ్రత్తగా పరిశీలించి చూస్తే, ప్రతివారి విషయంలోనూ అదే నిజమని అనిపిస్తుంది. ఫలితంగా, అది మనలను చాలా పొంతనలేని అసంగతమైన ప్రకటనలను చేసేటట్లుగా ప్రోద్బలం చేస్తుంది, కాని అది సంపూర్ణ సత్యం; ఉదాహరణకు, ఒక పెద్ద గజదొంగ అత్యంత ఋజువర్తనశీలి గావచ్చు (దీనిని చెప్పి నిన్ను దొంగతనా

నికి పురికొల్పటం కాదు!), అదే విధంగా గొప్ప అబద్ధాలకోరు అత్యంత నిజాయితీ పరుడు గావచ్చు. కనుక నీలో గొప్ప బలహీనత నొకదానిని నీవు కనుగొంటే దానికి నిరాశచెందవద్దు, బహుశా, అది అత్యంత దివ్యదారుఢ్యతకు సూచన కావచ్చు. "నేను అంతే, ఇంకొక రకంగా ఉండలేను" అనే మాట అనవద్దు. అది నిజం కాదు. నీవు "ఆ విధంగా ఉంటున్నావు" అనేదానికి కారణం, కచ్చితంగా, నీవు దానికి వ్యతిరేకంగా ఉండితీరవలసిన విధాయకం ఉన్నది కాబట్టే. కనుక నీకున్న ఇబ్బందులన్నీ ఎందుకున్నాయంటే వాటిలో దాగి ఏ సత్యం వున్నదో దానిగా వాటిని పరివర్తనం చేయడం నీవు తెలుసుకోగలందులకే.

ఒకసారి నీవు దీనిని అవగాహన చేసుకుంటే, చాలా బాధలు దూరమౌతాయి, నీవు చాలా సంతోషంగా ఉంటావు, ఎంతో సంతోషంగా ఉంటావు. ఒక వ్యక్తి గనుక అత్యంత నల్లనైన బిలాలను తనలో చూడటం తటస్థించితే అతడు, "ఇది నేను ఎంతో ఉచ్ఛస్థితికి ఎదగగలనని తెలియజేస్తున్నది" అని అంటాడు, ఆ లోతు అగాధమే అయితే, "నేను చాలా ఉచ్ఛస్థితికి ఎదగగలను" అని అంటాడు. విశ్వజనీన దృక్పథంలో ఇది యథార్థం, నీకు చాలా పరిచయమైన హిందూపరిభాష ప్రకారం, గొప్ప రాక్షసులే అత్యంత ప్రకాశస్వరూపులు. ఎప్పుడైతే ఈ రాక్షసులు పరివర్తన చెందుతారో, అప్పుడు వారే సృష్టిలో పరమోచ్ఛ సంభూతులుగా అవుతారు. ఇది నిన్ను రాక్షసుడివి కమ్మని ప్రోద్బలం చేయడం కాదు, తెలుస్తున్నది కదా, కాని విషయం మాత్రం అది — ఇది మీ మనస్సులను కొంచెం విస్తృతపరుస్తుంది, మంచిచెడులంటూ వ్యతిరేకించేటటువంటి భావాల నుంచి మిమ్ములను విముక్తులను చేయటానికి ఇది సహకరిస్తుంది, కాని నీవు ఆ వర్గంలోనే ఉండదలచుకుంటే, దానిలో నుంచి బయటపడే ఆశే లేదు.

ఈ ప్రపంచం ఏ విధంగా తయారై ఉందో సారతః దానికి వ్యతిరేకమైనది కానట్లయితే, దాని ఉద్ధరణకు ఆశే లేదు. ఎందువల్లనంటే ఆ రంధ్రం గాఢాంధకారంతో ఎంతో లోతైనదై, సంపూర్ణంగా నిశ్చేతనం అయింది, అది పూర్ణచైతన్యానికి సంకేతమే కాకపోతే, ఇక ఎవరైనా చేయగలిగింది మటుకు ఏముంటుంది, తమ మూటాముల్లె సర్దుకుని మకాం ఎత్తేయాల్సిందే. శంకరు డంతటివారే, తమ నాసికాగ్రాన్ని దాటి చూడలేక, ఈ ప్రపంచం నివసించయోగ్యం కానిదనీ, అలా చేయడం అసాధ్యం కాబట్టి, దానిని భ్రాంతిగా తలంచి నిష్క్రమించవలసిందేననీ, దానితో చేయగలిగింది

ఏమీ లేదనీ చెప్పటం జరిగింది. దానికి వ్యతిరిక్తంగా నేనేమి చెప్తానంటే, ఈ ప్రపంచం చాలా చెడుగా ఉంది కాబట్టే, చాలా అంధకారంతో, ఎంతో అసహ్యంగా, ఎంతో అచేతనతో పూర్తిగా దీనావస్థతో, కష్టాలతో నిండి ఉన్నది కాబట్టే, అది పరమోత్కృష్ట దివ్య సౌందర్యంగా, పరంజ్యోతి దివ్యప్రకాశంగా, పరమోత్కృష్ట దివ్య చైతన్యంగా, పరమోత్కృష్ట దివ్య ఆనందంగా తయారు కాగలదు.

"నీవు అనుక్షణం కని పెట్టి ఉంటూ, నీ బాహ్యాభివ్యక్తి యందు శ్రద్ధను కలిగి అప్రమత్తంగా ఉంటే ఏమి చేయాలనేదాని ప్రేరణను నీవు తప్పకుండా అందు కుంటావు. నీవు వెనువెంటనే దానిని చేయటానికి తప్పక ఉద్యుక్తుడవు అవుతావు".

ప్రశ్నలు — సమాధానాలు 1929 (21 ఏప్రియల్)

కొన్ని క్షణాల మునుపు, ఎంతో తీవ్రావేశ గాఢతతో శక్తి మేరకు శ్రేష్టంగా చేయాలనీ, శ్రేష్టమైనదానిని శక్తిమేరకు చేయాలనీ, దానినే ప్రతి క్షణమూ తప్పక ఆకాంక్షించాలనీ నేను చెప్పినప్పుడు, మీరు నన్ను ఈ ప్రశ్నను అడిగి ఉండవలసి ఉంది, "అదంతా బాగానే ఉంది కానీ, దానిని తెలుసుకోవటం ఎట్లా?". బాగుంది, దానిని తెలుసుకోవలసిన ఆవశ్యకత లేదు! నీవు చిత్తశుద్ధితో ఇటువంటి వైఖరిని కలిగి ఉంటే, నీకు ప్రతి క్షణం ఏమి చేయాలో తెలుస్తుంది, అది చాలా అద్భుతం! నీ చిత్తశుద్ధి ననుసరించి, ప్రేరణ ఎక్కువెక్కువగా కచ్చితమైనది, ఎక్కువెక్కువగా నిర్దుష్టమైనది అవుతుంది.

"నీవు కేవలం గుర్తుంచుకోవలసిన విషయం సమర్పణ, అంటే నీవు చేసే పనుల వల్ల ఎటువంటి ఫలితాలు వచ్చినా ఆమోదించడమే, ఆ ఫలితం నీవు అనుకున్న దానికి విరుద్ధంగా వచ్చినా సరే. ఇంకొక విధాన, నీ సమర్పణ ఉదాసీనమైనదైతే, నీవేమీ చేయవు, దేని కోసమూ ప్రయత్నించవు సరి కదా, నీవు నిశ్చింతగా నిద్రపోయి, అద్భుతానికై నిరీక్షిస్తుంటావు".

"ఇప్పుడు నీ ఎదుటనున్న ప్రశ్న, నీ ఇచ్ఛ లేక కోరిక, దైవేచ్ఛ ఒకటేనా కాదా అనేదే. దానికి నీవు చేయవలసినది, నీకు సమాధానం వచ్చిందా లేక ఏ సమాధా నమూ లేదా, నీకు ఆసరా లేక వ్యతిరేకత లభించినట్లనిపిస్తోందా, అనే విషయం మనస్సు లేక ప్రాణికం లేక శరీరంతో కాకుండా, నీ అంతరంగం లోతుల లోపల, నీ హృదయకుహరంలో నీకు తెలియని, ఎల్లప్పుడూ వసించేదేదో దానితో తప్పక చూసి తెలుసుకోవాలి".

ప్రశ్నలు — సమాధానాలు 1929 (21 ఏప్రియలు)

అది ఎల్లప్పుడూ ఆ విధంగానే జరగాలి. అది మన తెర దాని ముందునుంచే అన్నింటినీ పోయేటట్లు చేసి, ఆ వ్యక్తి తాను అనుకున్నది చేయటమా లేక చేయవద్దనే విషయం చెప్పబడిందా అనే నిర్ధారణ జరగాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

పనిలో ప్రతిబంధకాలు

ఈ ఉదయం ఐదు నిమిషాలు పనిచేసి నేను అలసిపోయాను. అదీ సామాను మెరుగు పెట్టటం మాత్రమే

చేతిపని ప్రతిదీ చేసేవాడికి ప్రారంభంలో కొన్నిసార్లు అలసటను తెస్తుంది. అయితే శరీరం క్రమంగా ఆ పనికి అలవాటుపడి శక్తిని పొందుతుంది. ఏదేమైనప్పటికీ నీవు నిజంగా అలసిపోయా ననుకున్నప్పుడు చేసే పనిని ఆపి విశ్రాంతి తీసుకోవాలి.

*

నీవు చేసే పనిని (అది ఎలాంటిదైనా సరే) దైవానికి సమర్పించి చేయటమే అలుపు లేకుండా పని చేసేందుకు సరైన మార్గం. నీకు కావల్సిన సాయం దైవం నుండి అందుతుంది. ఎందుకనగా భగవంతుని శక్తి అపారమైనది. నిజాయితీతో చేసే ఏ అభ్యర్థనకైనా ఆయన స్పందిస్తాడు.

నీ ద్వారా, నీలోని దైవక్రియాశక్తే ఆ పనిని చేసిందని అనుభూతి చెందినపుడు ఆ గొప్పతనం ఆయనదేకాని, నీది కాదని నీ నిష్కపటత వల్ల తెలుసుకుంటావు — ఇక అప్పుడు గర్వానికి ఆస్కారమే ఉండదు.

*

ఆ పనికై (చేసే పనికై) వెంపర్లాడకుండా నా బాహ్య కార్యక్రమానికి నన్ను పరిమితం చేసుకొని, ప్రశాంతంగా చేసే పనికే నన్ను నేను కట్టడి చేసుకోవాలని కొంతకాలం నుండి నాకు అన్పిస్తున్నది.

నాలో ఏదో తెలియని ఆందోళన కలుగుతోంది. నా జీవితం లక్ష్యరహితంగా తయారౌతున్నది. నా అంతరంగ అస్థిరతను గురించి ఒక స్వప్నం నన్ను

పదే పదే హెచ్చరిస్తున్నది. నేను, నాలో ఒక సమతను, స్థిరతను పొందాలి, అది అత్యవసరం. ఈ అస్పష్ట, భారమైన జడత్వం ఇంక సమసిపోయి తీరాలి. అమ్మ అనుమతిస్తే శాఖాపరమైన పని నుండి బయట పడాలనుకుంటున్నాను. ఏదేమైనా అమ్మ అదేశానుసారం నడచుకుంటాను. దయవుంచి నాకు దారి చూపండి.

నీవు నీ డిపార్ట్‌మెంటును వదిలేస్తే ఆ పని పాడైపోతుంది కదా. సరే. నాకు ఓ క్షణం విరామం దొరకగానే ఉదయం వేళ నిన్ను పిలుస్తాను. దానిని గురించి అప్పుడు మాట్లాడుకుందాంము.

నేను ఎంతెంతగా ముందుకు పోతుంటే, పని ద్వారానే శ్రీఅరవిందుల పూర్ణ యోగం ఉత్తమంగా సాధించబడుతుందని అంతంత యెక్కువగా తెలుస్తోంది.

*

ఏదో ఒక అడ్డంకి వల్ల అస్తిత్వంలోని ఏదో ఒక భాగం లేదా అనేక భాగాలు వాటికి అందే శక్తిని, చైతన్యాన్ని, వాటిపై ప్రసరించే వెలుగును స్వీకరించక తిరస్కరించి దివ్యప్రభావానికి యెదురు తిరిగినందువల్ల కష్టాలు ఎప్పుడూ వస్తాయి. ఈ బాధలలో ఏదో ఒకదానిని ఎదుర్కొనకుండా దైవ సంకల్పానికి పూర్తిగా సమర్పణ అయ్యేవారు, అరుదు. అయితే ఆకాంక్షను స్థిరం చేసి పరిపూర్ణ నిజాయితీతో తన్ను తాను తెలుసుకొనుటయే కష్టాలన్నీ అధిగమించడానికి సరైన మార్గం.

*

అధిగమించవల్సిన, మనలో దాగియున్న, బలహీనతలను మనకు తెలియజెప్పేందుకే అనుకోని పరిస్థితులు ఎదురౌతాయి.

*

మనలోని ఏ భాగాలలో వెనుకబడిపోయామో, మానసికం, ప్రాణికాల కోలాహలానికి చెవి ఒగ్గి ఆత్మ వైపు నుండి మనం వెనక్కు నడిచిన నడకలేవో తెలిపేందుకు దైవానుగ్రహంగా అలజడులు, పరీక్షలు మనకు ప్రాప్తిస్తాయి.

ఆధ్యాత్మిక జీవితంలో వచ్చే బాధలను వినమ్రంగా స్వీకరించుటెలాగో మనం తెలుసుకొంటే, ఎంతటి దూరాన్నైనా ఒక్క దూకు దూకి దాటగలం.

*

ఎన్నడూ అసంతృప్తి చెందకు. ఎప్పుడైతే అసంతృప్తి చెందుతావో అప్పుడు అన్ని

రకాలైన శక్తులు నీలో ప్రవేశించి నిన్ను పతనం చేస్తాయి. ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఉండు.

మూలం: శ్రీమాత

అనువాదం: బాషా

ఎందుకు మనం కర్మ చేయాలి?

ఓ ప్రియమైన మాతా! ఇక్కడ ఇలా ఉంది "ఈ స్వేచ్ఛను, ఈ పరిపూర్ణతను, సుసంపన్నతను మన కొరకు కాక దైవం కొరకు సాధించవలసి ఉంది" మనం చేస్తున్న సాధన మన కొరకు కాదా?

కాదు. ఈ అంశాన్నే వారు కావాలని నొక్కి చెప్పారు. మనం సాధించదలచిన పరిపూర్ణత అంతా మన వ్యక్తిగత ప్రయోజనాల కొరకు కాకుండా కేవలం దైవ ఆవిష్కరణ కొరకు, దైవసేవ కొరకు మాత్రమే అయి ఉండాలి. మనం ఈ సాధన వ్యక్తిగత పరిపూర్ణత కొరకు చేయడం లేదు. దైవకార్య సిద్ధికై చేస్తున్నాము.

మరి ఈ దేవుని కార్యాన్ని మనం ఎందుకు నిర్వర్తిస్తున్నాము? మనల్ని మనం...

కాదు కాదు.ఎంత మాత్రం కాదు. ఎందుకంటే అది దైవసంకల్పం. వ్యక్తిగత కారణం కానే కాదు. కారాదు. ఇది కేవలం దైవసంకల్పం, దైవకార్యం.

ఎలాంటి వ్యక్తిగత అభిలాష, వైయక్తిక కోరిక, స్వార్థపూరిత మనోవ్యాపారం ఇందులో ఏమాత్రం కలిసినా అది ఒక మిశ్రమం లాగా మిగిలిపోతుందే తప్ప కచ్చితమైన నిజదైవ సంకల్పాన్ని వ్యక్తీకరించదు. మనం పరిగణనలోనికి తీసుకోవలసిందల్లా కేవలం, దైవం, దైవసంకల్పం. ఆయన అభివ్యక్తి ఆయనను వ్యక్తం చేయడం. ఏ వ్యక్తి ఐనా ఇక్కడ ఉన్నది అందుకే. అదే అతను. ఇతరం కాదు. వైయక్తికత ఒక వ్యక్తిలోనికి ప్రవేశించిందంటే అతను ఇంకా పూర్ణ పరివర్తన చెందలేదని అర్థం. ఇది ఒక్క రోజులో సాధ్యమయ్యే పని అని నేను చెప్పడం లేదు. కాని అదే సత్యం.

ఈ ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎందరెందరు వ్యక్తులో ఉన్నారు. చాలామంది ఆధ్యాత్మిక జీవనాన్ని, యోగసాధనను అవలంబిస్తున్నారు. కాని వాళ్ళు స్వీయమైన వివిధ కారణాల వల్ల కొనసాగుతున్నారు. కొందరు జీవితంలో విసిగిపోయి, కొందరు

దుఃఖంతో, అశాంతితో బాధపడుతూ, కొందరు జిజ్ఞాసతో, కొందరు ఆధ్యాత్మికంగా ఉన్నతులు గావాలని, మరి కొందరు మరింత అభ్యసించి ఇతరులకు బోధించాలని — ఇలా యోగసాధన విషయంలో ఇలాంటి వేనవేల వైయక్తిక కారణాలు ఉన్న మాట వాస్తవం. కాని, తమను తాము పరిపూర్ణ ఆత్మార్పణం కావించుకొని భగవంతుని సంకల్పం మేరకు సత్యతతో నిత్యత్వంతో రూపొందింపబడడానికి అర్హులైనవారు కొందరే అని చెప్పాలి. కాని అదే సత్యం, లక్ష్యంకేసి నేరుగా తీసుకుపోయే మార్గం. మిగతా ఉద్దేశాలన్నీ సంకరమైనవి, మిశ్రమాలు, అహంకార ఛాయలున్న కల్మషాలు.

ఇలాంటి కేవల భావన కలిగి ఏకైక జీవన ధ్యేయం, ఏకైక లక్ష్యం, ఏకైక ఉద్దేశం, ఎలాంటి వ్యకిగత జోక్యం కాని ప్రతిచర్యలుగాని లేనితనం, ఆత్మ పరమాత్మల మధ్య ఏమాత్రం స్వపర భేదాన్ని గుర్తించజాల నంతటి స్థితికి చేరుకున్న సంపూర్ణ ఆత్మార్పణం, తానే అతనైపోయి నంతటి అభేద భావ సంలీనం — ఇదే నిజమైన ఆదర్శ వైఖరి. పైగా, ఇదే నీ క్రియాశీలతను జీవన పురోగతిని ముందుకు నడిపించేది. ఇదే నిన్ను అన్ని వేళలా ఆదుకునేది. ముఖ్యంగా నీ నుండి నిన్ను కాపాడేది. అహంకారాన్ని మించిన అపాయకారణం మరొకటి లేదు కనుక, ఇదే నిన్ను ఆ ప్రమాదం నుండి రక్షించేది.

ఇదే శ్రీఅరవిందులిచట తెలిపినదాని అర్థం.

మాతా! మనం చేసేదంతా దైవం కొరకేనని కదా మీరు సెలవిచ్చింది?

అవును.

కాని, భగవంతుడు ఎందుకిలా ఈ సంక్షుభిత భూమి మీద తనను తాను ఆవిష్కరించుకోదలచాడో?

అతడు ఈ పృథివిని సృష్టించింది అందుకే. మరెందుకో కాదు. ఆతని స్వీయ స్వరూప వికారమే ఈ భూమి. నిజానికి అతనే. ఈ వసుధ అతనికి వేరుగా లేదు. అతనికి పరాయిది కాదు. రూపభేద వికారం గలదైన పృథివిని పునః దాని మూలసారంలో అంటే దైవంలో ప్రతిష్టించాలన్నదే, అతని మహోద్దేశం

మరి ఎందుకతడు మనకు అన్యుడుగా ఉంటున్నాడు?

బాబూ, అతడు మనకు అన్యుడూ కాదు. ఎన్నడూ పరాయివాడూ కాదు. అది నీ ఊహ మాత్రమే. అతడు నీ యావత్తు ఉనికికి మూలం అని నీవు గ్రహించకున్నావు. కాని అతడు నీ పూర్ణ అస్తిత్వం. దైవానుగ్రహం లేనినాడు నీవు క్షణలేశం కూడా

మనలేవు. ఒకానొక వైకృతిలో ఒకానొక అసత్య విభ్రాంతిలో జీవిస్తున్న కారణంగా నీలో ఆ చైతన్యం కలగడం లేదు. నీ గురించిన నిజచేతన ఇంకా నీలో కలుగలేదు. నీవు, నీవు కాని ఏదో ఒక చేతనలో ఉండి, అది నీవేనని నీ వనుకుంటున్న భ్రాంతిలో పడిపోతున్నావు.

మరి నేనేమిటి?

దైవం!

మూలం: శ్రీమాత

అనువాదం: నాగరాజు రామస్వామి

కర్మయోగ సంపూర్ణ రహస్యం

ఒక మహోన్నత ఆధ్యాత్మికచేతన లోనికి, ఒక విశాలతర దివ్యజీవితం లోనికి మొత్తం అస్తిత్వ పరివర్తనను, పూర్ణయోగం తన సంపూర్ణ చరమ లక్ష్యంలో ఒక ప్రధాన అనివార్య అంశంగా స్వీకరిస్తుంది. మన ఇచ్ఛ, కర్మల భాగములు, జ్ఞానాంశములు, మనలోని చింతనశీలి, మన భావావేశ కేంద్రము, మన జీవన కేంద్రము, మనలోని సమస్తమూ, ఆత్మ, ప్రకృతి మొత్తం దైవాన్ని కాంక్షించాలి, అనంతునిలో ప్రవేశించాలి, శాశ్వతునితో ఏకం కావాలి.

కాని మానవుని ప్రస్తుత స్వభావం, పరిమితమై, విభజించబడి, అసమతకు లోనై ఉంది — అతని అస్తిత్వపు, అత్యంత బలీయమైన భాగంలో కేంద్రీకరించి, అతని స్వభావానికి తగిన, ఒక కచ్చితమైన పురోగమన విధానాన్ననుసరించడం అతనికి చాలా తేలిక. అరుదైన కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే, దైవ అనంతత్వపు మహాసాగరం లోనికి సరాసరి పెద్ద మునక వేయడానికి తగిన బలం వుంటుంది. అందుచేత కొంతమంది తనలోని పరమాత్మకు సంబంధించిన శాశ్వత సత్యాన్ని కనుగొనేందుకు భావంలో ఏకాగ్రత, లేదా జపం, లేదా త్రాతక పద్ధతిని ప్రారంభంలో యెన్నుకొంటారు. ఇతరులు చాలా సునాయాసంగా శాశ్వతుని కలుసుకొనడానికి మనలో అతనుండే చోటైన హృదయంలోనికి ఉపసంహరించుకొంటారు. అతి క్రియాశీలురు, అతి చురుకైన మరి కొంతమంది ఉన్నారు. వీళ్ళు తమ ఇచ్ఛను కేంద్రంగా

చేసుకొని కర్మల ద్వారా తమను విస్తృతం చేసుకొంటారు.

సమస్తానికీ మూలమైన దాని అనంతతత్వంలో తమ ఇచ్ఛను సమర్పించడం ద్వారా, పరమాత్మతో, సమస్త మూలంతో తాదాత్మ్యత చెంది, అంతరంగంలోని రహస్య దైవత్వంచే తమ కర్మల యందు నడుపబడుతూ లేదా వైశ్వకర్మ ప్రభువును, గురువుగా, చింతన, సంవేదన వగైరా తమ సమస్త శక్తులనూ కదలించువానిగా భావించి, విశాల అస్తిత్వాన్ని సంతరించుకొంటారు. ఈ విశాల అస్తిత్వం వల్ల నిస్వార్థపరులుగా, విశ్వజనీనులుగా తయారై వారు ఒక ఆధ్యాత్మిక స్థాయికి చెందిన ఒక ప్రధమ పరిపూర్ణతా స్థితికి చేరుకొంటారు.

అదెచటి నుండి ప్రారంభమైనప్పటికీ ఆ దారి ఒక సార్వభౌముని అధికారం క్రిందగల ఒక బృహత్తర సామ్రాజ్యం లోనికి చేరుకొని తీరాలి. చివరికది, జ్ఞానం, భావావేశం, క్రియాశీల కర్మేచ్ఛ, అస్తిత్వ స్వభావపు పరిపూర్ణతల సమగ్రతకు సంబంధించిన దానంతటి ద్వారా సాగాలి.

*

మానవుని ప్రతి కార్యకలాపాన్ని పరాత్పరుని ఇచ్ఛకు అంకితం చేయడాన్ని కర్మ యోగ మార్గం లక్ష్యంగా చేసుకొంటుంది. మన కర్మలకు సంబంధించిన సమస్త అహంకారిక లక్ష్యాన్ని, స్వలాభాపేక్షగల కర్మలనూ లేదా లౌకిక ఫలిత లక్ష్యాన్నీ త్యజించడం ద్వారా అది మొదలౌతుంది. మహనీయ విశ్వజనీన మహాశక్తి, ఆ శక్తి ప్రభువు, కర్మలను పాలించువాడు, నిర్దేశకుడు, వ్యక్తిని కేవలం ఒక ముసుగుగా, ఒక సాకుగా, ఒక ఉపకరణంగా లేక, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే. కర్మ చేయడానికి, దృశ్యజగత్తుతో సంబంధం పెట్టుకోడానికి ఒక సచేతన కేంద్రంగా చేసుకొని, మన కర్మల నన్నింటినీ నిజంగా చేస్తున్నాడని మనం తేలికగా యెరుగ గలిగేటట్లు మన మనస్సును, ఇచ్ఛను ఈ స్వార్థత్యాగం పరిశుద్ధం చేస్తుంది. కర్మను యెంచుకొనడం, కర్మ చేసే విధానాన్ని ఎంచుకొనడం, అధికాధికంగా ఈ పరమోత్కృష్ట దైవేచ్ఛకు ఈ విశ్వజనీన మహాశక్తికి యెరుకతో వదలివేస్తాము. ఆ 'తత్' నకు మన కర్మలు, కర్మఫలితాలు అన్నింటినీ చివరకు విడిచివేస్తాము.

*

తన సమస్త కార్యకలాపాల యందు సంకల్పాన్ని ఒక పరిపూర్ణ సమర్పణ ద్వారా

దైవసాన్నిధ్యంతోనూ, దైవశక్తితోనూ ఐకమత్యతను సృజించడమే, కర్మయోగ పథగామి కుండవలసిన అత్యున్నత ఆకాంక్ష.

*

ముందు మన మానవ వ్యక్తిగత ఇచ్ఛను పవిత్రీకరించి నివేదించడం, తరువాత దాని ననుసరించి ఒక గొప్ప దివ్యసంకల్పంలో లేదా మహనీయమైన పరమోత్కృష్ట దైవేచ్ఛలో లీనం చేయడం కర్మయోగం యొక్క ప్రధానోద్దేశ్యపు రహస్యం మరియు హృదయం. అల్ప మానవహద్దులుగల మన మానసిక చేతనతో ఇది పూర్తిగా చేయలేం. మన మానవ క్షుద్ర, బాధా సంతసాలు ఏ నాటికీ తలెత్తలేనట్లు దేనిలో కరిగిపోతాయో ఆ బృహత్తరానందానికై తెరచుకొని, మహాబలీయమైన, పొరపడని శక్తిని ఆయుధంగా ధరించి, జ్ఞానం యొక్క యధార్థతర ప్రకాశంతో, వివేకవంతమైన ఒక గొప్పచేతన లోనికి దానిని వదలివేసి, ప్రవేశించడానికి మన యోగం మనకు తప్పక సహాయపడాలి. మన మానవచేతన పరిమితులలోనే సాధించగలిగినదేది ఇంకా వుందో అదే మనకు గొప్ప విమోచన కలిగిస్తుంది.

*

మన అజ్ఞానమయ వ్యక్తిగత ఇచ్ఛను ఒక మహనీయ దైవం లోనికి లేదా మరింత మహోన్నత శిఖరాల మహా మహనీయ దైవేచ్ఛ లోనికి క్రమంగా పురోభివృద్ధి చెందే సమర్పణ గావించి, దానిని నిమజ్జనం చేయడమే కర్మయోగం యొక్క మొత్తం రహస్యం. ఈ బృహత్తర, ఆనందకర తాదాత్మత సాధ్యమయ్యే పరిస్థితులను కల్పించుట, మనం దానిని చేరుకోవాలంటే, మనం అనుసరించదగిన మార్గాల నేర్పరచుకొనుట ఈ శిక్షణా విధానానికి సంబంధించిన లోతైన కార్యం. దీనికి మొట్టమొదటి షరతు: వ్యక్తిగత ప్రాణికవాంఛా నిర్మూలన. ఎందుకనంటే కోరిక ఇందులో తల దూర్చితే, పరాత్పర దైవేచ్ఛతో సామరస్యత అసాధ్యమౌతుంది. ఒక వేళ మనం దానిని పొందినా, దాని కార్య విధానాన్ని అస్తవ్యస్తం చేస్తాం, దాని క్రియాశీల ప్రేరణను వికృతం చేస్తాం. సమస్త కోరికను వదులకోవాలి, ఫలితం మీద, పారితోషికం మీద, విజయం మీద పట్టుబట్టడాన్ని మన సంకల్పం నుండి పారద్రోలాలి. అసలు, పని మీదే, ప్రాణికానికుండే లాలసను, మన స్వభావం నుండి కత్తిరించిపారెయ్యాలి. ఎందుచేతనంటే అటువంటి లాలస మనం చేసే కర్మ, లోని అధిష్టాన దైవానిది కాదు, మనదే అనుకునేటట్లు చేస్తుంది. రెండవ షరతు: అహంకార నిర్మూలన:

కోరికను పెనవేసుకుపోయిన రాజసిక, తామసిక అహంకారాలనే గాక కర్మ చేసేవాడిని 'నేను' భావనలో ఆశ్రయం పొందే సాత్త్వికాహంకారాన్ని కూడా నిర్మూలించాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి రావు

ఇదీ కర్మయోగం

తనను తాను ఇతరం నుండి విడగొట్టుకొని, ఆ విడిపోయినదాని యందు బందీయై యున్న మనస్సులో ఇకనెంత మాత్రం చిక్కుకొని ఉండిపోకుండా, దాని అజ్ఞాన ఆదేశాలకు, సంకుచిత సలహాలకు బానిసైపోకుండా, మనలోని, మన చుట్టూ వున్న జగత్తులోని, మనకు పైన విశ్వాతీతమై ఉన్న దైవంతో ఒక సన్నిహిత ఏకత్వంలో ప్రగాఢ సంసర్గం కలిగి వుండి, కర్మలను చేయుటయే కర్మయోగం.

అహంకారపు కొరడా దెబ్బలకు, కామన అవసరానికి, ఆవేగానికి లోనై, మానసిక, ప్రాణిక, భౌతిక మక్కువల ముల్లు పోట్లతో తోలబడకుండా దైవాజ్ఞకు, శాశ్వత దివ్య సంకల్పానికి, ఒక విశ్వాతీత, విశ్వగత ప్రేరణకు విధేయమై భగవంతునితో మాత్రమే, మహోన్నత దివ్యసత్యంతో మాత్రమే కదిలించబడుతూ పనిచేయడమే కర్మయోగం.

మానవ అజ్ఞానంలో నివసిస్తూ ఇహనెంత మాత్రం కర్మ చేయకుండా, వ్యక్తిగత స్వభావాన్ని గురించిన, విశ్వజనీన శక్తుల గురించిన యెరుకతో, విశ్వాతీతమైన దాని పాలన కనుగుణంగా దివ్యజ్ఞానంలో జీవిస్తూ కర్మ చేయడమే కర్మయోగం.

దైవంలో, అపరిమేయమైన, ప్రకాశమయ విశ్వజనీనమైన, విశ్వాతీతమైనదాని కున్మీలనమై, ఇక నెంతమాత్రం పాత సంకుచితత్వంలో, అంధకారంలో తడుము కొంటూ, తడబడుతూండకుండా దైవముగా తయారై నివసిస్తూ పనిచేయడమే కర్మ యోగం. నీ ఆత్మసంకల్పంతో, కామనతోగాక, శాస్త్రం ప్రకారం కర్మ చెయ్యి. అలా చేస్తే నీలోనే ఉండి నిన్నుహరించువానిని నియంత్రించు శక్తివంతుడవుతావు. కాని శాస్త్రప్రకారంకన్న భగవంతుని అనుసరించి కర్మ చెయ్యి. అలా చేస్తే, విధు లను, పరిమితులను మించి ఎంతో పైనవున్న, ఆతని పరమోన్నతస్థితికి చేరుకొంటావు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

కర్మ చిక్కుముడిని విడదీయడం ఎలా?

కర్మమార్గంలో 'పని చేయడం' అనేది ఒక చిక్కుముడి. దానిని ముందు మనం పరిష్కరించాలి. అది 'వాంఛ' తోనో, అహంతోనో ... ఎక్కడ చిక్కుపడిందో చూచి దానిని విడదీయడానికి గట్టిగా ప్రయత్నించాలి. లేని యెడల అసలు మనల్ని బంధించిన దాన్ని గాక, ఆ ముడికి సంబంధించిన దాని చెదరిన దారపుపోగులను మాత్రమే కత్తిరిస్తాము. ఈ అజ్ఞాన పూరిత విభజనాత్మక ప్రకృతికి మనం లోబడి వుండడానికి కారణం 'కోరిక' 'అహంభావం' అనే ఈ రెండు ముడులే. ఈ కార్య క్షేత్రంలో 'వాంఛ' అనేక రూపాలు కల్గి వుంటుంది. పనికి ప్రతిఫలాపేక్ష లేదా ప్రాణిక పురుషుడిలోని వాంఛే వాటన్నింటి కన్నా బలీయమైనది. మనం ఆశించిన ఫలితం ఆంతరిక సంతోషానికి పారితోషికం కావచ్చు. అది మనం ప్రాధాన్యత నిచ్చిన ఒక ఉద్దేశ్యం నెరవేరగా లభించిన ఫలితం కావచ్చు లేదా మనం అమితంగా కోరుకున్నదాని యొక్క లేదా అహంకారపూరిత ఆవేశాలు సంతృప్తిపడగా లభించిన లేదా మన అత్యాశలకు, మన మహత్వకాంక్షలకు కల్గిన విజయగర్వపు ఫలితం కావచ్చు. లేదా ఏదైనా బాహ్యమైన వస్తురూప ఫలితమైన బహుమతి కావచ్చు. మనం ఆశించిన దానిని భర్తీ చేసే భౌతికమైన ఫలితమే కావచ్చు — సంపద, హోదా, గౌరవం, గెలుపు, అదృష్టం, ఇలా అది శారీరకమైన, ప్రాణికమైన 'వాంఛ' ను నెరవేర్చుకొన్న దాని ఫలితమైనా కావచ్చు. కానీ ఇవన్నీ మనల్ని ప్రలోభపెట్టే ఆకర్షణలే.... వీటన్నిటి ద్వారా 'అహంకారమే' మనల్ని తన పట్టులో బిగిస్తుంది.

వీటివల్ల కల్గే సంతృప్తి ఒక రకమైన ఆధిపత్యం పేరిట, స్వేచ్ఛ పేరిట, మనల్ని మోసపుచ్చుతుంది. సూక్ష్మంగానో, స్థూలంగానో, ఉన్నతంగానో, హీనంగానో అనేక రూపాల్లో ఈ ప్రపంచాన్ని నడుపుతున్న అంధమైన 'వాంఛ' వేశే కళ్ళానికి కట్టుబడి, దాని కొరడా దెబ్బలు తింటూ, దాని సవ్వారిలో, దానిచే నడుపబడుతున్నాం. కాబట్టి పనిచేయడానికి 'గీత' ప్రతిపాదించిన మొట్టమొదటి కర్మసూత్రం. చేసే పనిలో ఫలితాన్ని కోరకుండా చేయడం... 'నిష్కామకర్మ' చేయడం. చూడ్డానికి ఇది చాలా తేలిగ్గానే వుంటుంది. పూర్తి నిజాయితీతో, పూర్తి సర్వ స్వతంత్రతతో ఏ కార్యాన్నైనా నెరవేర్చడం ఎంత కష్టం! మనం చేసే దానిలో ఎక్కువ భాగం ఈ నిష్కామకర్మ సూత్రాన్ని చాలా కొద్దిగా అది కూడా చాలా మట్టుకూ సహజమైన

ఫలాపేక్ష అనే సూత్రానికి సరిపోల్చి సర్దుబాటు చేయడానికి, మనలోని హద్దులు దాటి పనిచేసే క్రూరమైన వాంఛా ఉద్రేకాన్ని శమింపచేయడానికే వాడతాం. చాలా వరకు మనలోని నైతికభావాన్ని దెబ్బతీయని, అట్లాగే ఇతరులకూ పాశవికంగా చేటుచేయని, సవరించుకొన్న, కట్టుదిట్టం చేయబడిన అహంకారంతో మనం సంతృప్తి పడుతున్నాం. ఇలా మన పాక్షిక స్వీయ ఆత్మనియంత్రణకు రకరకాల పేర్లనూ, రూపాలనూ సంతరింపజేస్తాం. విధినిర్వహణ, నియమపాలనలో దృఢభక్తి, స్థితప్రజ్ఞతతో కూడిన మనస్థైర్యం, భగవదేచ్ఛకు ఒక నిశ్చలమైన, పారవశ్యపూర్వకమైన అర్పణ మొదలగు విషయాల్లో తర్ఫీదు ఇచ్చుకోవడానికి మనకు మనమే అలవాటు పడ్డాం. అయితే వీటి నేటినీ 'గీత' తలపోయడం లేదు. అవి వాటి వాటి స్థానాల్లో ప్రయోజన కరమైనవే కావచ్చు గాక.

గీత లక్ష్యం మాత్రం పరిపూర్ణమైన, వెనక్కు పోనివ్వని, రాజీ ప్రసక్తిలేని ఒక మలుపు, అంతరాత్మ సమస్థితిని మొత్తంగా పరివర్తనం చెందించే వైఖరి ఉన్నది. ప్రాణిక సంబంధమైన ప్రేరణపై మనసు యొక్క నియంత్రణ అన్నది గీత 'నియమం' కాదు. ఒక అమృతాత్మ శక్తికి సంబంధించిన దృఢమైన సుస్థిరత్వం దాని ప్రధాన సూత్రం. ఫలితాలన్నింటి పట్ల, అన్ని ప్రతిక్రియల పట్ల, జరిగే అన్ని ఘటనల పట్ల, హృదయం మనస్సుల నిరపేక్ష సమతను గీత పరీక్షిస్తుంది. ఒక వేళ అది శుభకరమైన దవ్వనీ, దుర్దశ అవ్వనీ, సన్మాన మవ్వనీ, అవమానమవ్వనీ, స్తుతికానీ, నిందగానీ, గెలుపుగానీ లేదా ఓటమి కానీ సంతోషకరమైన ఘటన అవ్వనీ, విషాదకరఘటన కానీ అది మనల్ని చలింపజేయకూడదు, తాకనైనా కూడదు. ఆవేశాల నుండీ, నర నాడుల్లో ఉద్రేక ప్రతికంపనాల నుండి, మనసు పరిధిలో కూడా విముక్తమయ్యి అంతర్గత స్వభావంలో ఎక్కడా కూడా ఏ చిన్న అలజడికి, కంపనానికి స్పందించడమ నేదే ఉండకూడదు. అప్పుడే 'గీత' నిర్దేశిస్తున్న నిర్దిష్టమైన పరిపూర్ణమైన విముక్తిని మనం పొందుతాం. అంతకు మించి వేరే విధంగా కాదు. మన క్రమశిక్షణ అపూర్ణంగా వుందనీ మనలో ఏదో ఒక భాగం అజ్ఞానాన్ని, బంధాన్ని, ఒక అనుసరణీయ శాసనంగా, అంగీకరించి పాత మానవీయ స్వభావానికి అతుక్కొని ఉందని చెప్పడానికి, మనలో కల్గే అల్పాతి అల్పమైన కంపనం ఒక నిదర్శనం. మన 'ఆత్మవిజయం' అన్నది పాక్షికంగానే సిద్ధించబడింది.

మన స్వభావ క్షేత్రంలో ఎక్కడో చిన్నగా, ఒక అంశమాత్రంగా అవాస్తవమైనదీ,

అపూర్ణమైనదీ ఇంకా ఏదో ఉన్నది. అపరిపూర్ణతకు చెందిన ఆ చిన్నపాటి గులకరాయి యోగం వల్ల సాధించినదాన్నంతా నేలపాలయ్యేట్లు చేస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: హర్షవర్ధన్

మన పనికి కారణమైన రూపాంతరీకరణం

తనకున్న కోరిక వల్ల, లేదా, ఒక మానసిక, ప్రాణిక, భౌతిక కోరిక, లేదా అవసరం యొక్క అనుభూతి వల్ల; శరీర అవసరాలు, సంపదపై వ్యామోహం; కీర్తి, గౌరవాల వల్ల; లేదా, వ్యక్తిగతంగా, బుద్ధి, హృదయం యొక్క సంతృప్తి కొరకు వెంపర్లాట, లేదా, అధికారం, ఆనందం కొరకు తృష్ణ — వీటిచే తరమబడటం వల్ల సాధారణంగా మానవుడు కర్మ చేస్తాడు. ఇంకా, ఒక నైతిక అవసరానికి అతడు పట్టుబడి, ముందుకు తోయబడడం వల్ల; లేదా, అతని భావాలు, ఆదర్శాలు, ఇచ్ఛ; లేదా అతని పార్టీ, దేశం, దేవతలు, ప్రపంచంలో కొనసాగుతుండాలనే కనీస అవసరం, లేదా కోర్కె వల్ల సాధారణంగా మానవుడు కర్మ చేస్తాడు. ఇవేవీ, లేదా ఇతరమైనవేవీ అతని పనికి కారకాలు కాకపోతే — అతని పనికి కావల్సిన ప్రోత్సాహాన్ని లేదా కారకశక్తిని తీసివేసినట్లై, పని ఆగిపోతుంది. ఇక్కడ 'గీత' సమాధానమిస్తుంది. తన మూడవ గొప్ప రహస్యంతో — దివ్యజీవనం యొక్క గొప్ప రహస్యంతో: అన్ని పనులూ చేయబడాలి, ఇంకా ఇంకా భగవచ్చేతన వైపు సాగేటట్లు, చివరకు, భగవచ్చేతనను పూని సర్వ కర్మలూ చేయాలి. పనులన్నింటినీ తప్పనిసరిగా, వానికి అర్పణ చేయాలి (యజ్ఞంలో సమిధలు వలె). ఇంకా చివరగా, మన సమస్త మనస్సు, సత్తా, ఇచ్ఛ, హృదయం, బుద్ధి, జీవితం, శరీరం కూడా ఆ ఏకైకునికి అర్పించాలి. . భగవత్ప్రేమ, భగవత్సేవ మాత్రమే మన కర్మ ఏకైక చోదకశక్తి కావాలి. కర్మను నడిపే శక్తి, కర్మల సహజ స్వభావంలో ఈ రూపాంతరీకరణే నిజానికి కర్మ యందలి కీలకమైన కేంద్రీయభావన. కర్మ, భక్తి, జ్ఞానముల అనన్య సమన్వయానికి ఇదే పునాది. చివర్లో, వ్యక్తి కోర్కెకాక, ఎరుకలో అనుభూతి పొందిన దైవేచ్ఛ మాత్రమే, పనిని నడిపే కారకం, ఏకైక మూలకారకం కావాలి.

సమత, పని ఫలితంపై కోర్కెను త్యజించడం, మన నైజానికి, ప్రకృతికి ప్రభువైన పరమేశ్వరునికి పనులను సమర్పించడం — ఈ మూడూ, గీతా కర్మ యోగమార్గంలో భగవంతుని వైపు పయనించే పద్ధతులు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

ఇది, మనం నిర్వహించితీరవలసిన కార్యం — సంక్షిప్తంగా

మనకు సంబంధించిన అస్తిత్వపు ప్రతి క్షణం, ప్రతి కదలిక శాశ్వతునికి ఆత్మార్పణగా పర్యవసించాలి. మన సమస్త కర్మలు, మహనీయమైన అత్యంత అసామాన్యమైన ఉదాత్తమైన కర్మలు మాత్రమేగాక, అత్యంత అల్పమైన అత్యంత సాధారణమైన ఏమాత్రం విలువలేని వాటిని కూడా, ఏమాత్రం తక్కువ శ్రద్ధతో గాక, పవిత్రమైన కర్మలుగా నిర్వహించాలి. మన అహం కన్నా గొప్పదైన, మన కతీతంగా ఆవల ఉన్న దివ్యమైన దేనికో, అంకితమైన మన ఆంతర, బాహ్య చలనం యొక్క ఏకైక చేతనలో మన వ్యక్తిగత స్వభావం జీవించాలి. అందువల్ల మనకేం ప్రయోజనం, లేదా మనం దాని నెవరి కందిస్తున్నాం అనేది అసలు ఆలోచించవలసిన విషయమే గాదు. సమస్త జీవులందలి ఒకే ఒక దివ్యపురుషునికి దాని నర్పిస్తున్నామనే చేతన ఆ కర్మలో తప్పక వుండాలి. మన అతి సామాన్య విషయాలు, లేదా అత్యత స్థూల మైన భౌతిక విషయాలు సైతం ఈ పవిత్ర లక్షణాన్ని సంతరించుకోవాలి. మనం భుజిస్తున్నప్పుడు మనలో కొలువైన దైవానికా ఆహారాన్ని అందిస్తున్న చేతన ఉండాలి. ఒక దేవాలయంలో జరుగుతున్న ఒక పవిత్ర నివేదనగా దానిని భావించాలి, దైహికావసరానికో లేదా స్వీయసంతృప్తి కోసమో చేస్తున్నామనే స్పృహ మన నుంచి తొలగిపోవాలి. ఏ గొప్ప కృషిలో నైనా, ఏ ఉన్నత శిక్షణా విధానంలో నైనా, ఏ కష్టమైన, లేదా ఉదాత్తమైన సాహసకార్యంలోనైనా, మన కోసంగాని, ఇతరుల కోసంగాని, లేదా జాతికోసంగాని, చేసే కార్యం, జాతి కోసం, మన కోసం, లేదా ఇతరుల కోసం అనే భావం దగ్గరే ఆపివేయడం ఎంతమాత్రం సాధ్యం కాదు. మనం చేసేటటువంటిది,


వీటికోసం గాక, వీటి ద్వారాగాని లేక సరాసరి, ఏకైక అధిష్ఠాన దేవతకు సచేతన యజ్ఞకర్మగా అర్పించబడాలి. ఈ రూపాలచే దాచబడిన అంతర్యామి దైవం, ఇంకెంత మాత్రం దాగి ఉండిపోక, మన అంతరాత్మలో మనస్సులో, మన స్పృహలో సదా ప్రత్యక్షంగా ఉండాలి. మనలోని ఆ దైవసాన్నిధ్యమే అనంతుడు, మహోన్నతుడు. కేవలం ఆతని వల్లనే మన శ్రమ, మన ఆకాంక్ష సాధ్యమౌతున్నాయి అనే సంవేదనలో, మన కర్మల విధానం కర్మఫలితాలు, ఆ ఏకైకుని హస్తాల్లో తప్పక వుంచాలి. ఎందుకనంటే ఆయన అస్తిత్వంలోనే సమస్తమూ సంభవిస్తాయి. విశ్వప్రకృతి మన శ్రమను, ఆకాంక్షను ఆయన కోసం స్వీకరించి ఆయన పూజాపీఠం మీద నివేదనగా అర్పిస్తుంది. వేటి విషయంలో విశ్వప్రకృతే ఎట్టి దాపరికం లేకుండా స్వయంగా పనిచేస్తున్నట్లు కన్పిస్తుందో, ఆమె కార్యసరళికి మనం, కేవలం సాక్షులమో, ఆమె పాత్రలమో, ఆమెకు ఊత మిచ్చువారమో అచట కూడా కర్మ యొక్క దివ్యప్రభువు మీదనే ధ్యాస నిలుపు చేతన, స్మృతి సదా ఉండాలి.

మన ప్రేరణే, మన ఊపిరే, మన హృదయ స్పందనలే, విశ్వజనీన మహాయజ్ఞపు సజీవ సచేతన లయలుగా మనలో తయారుకాగలవు, అవ్వాలి.

తరువాత: ఏకైక కేంద్రీయ విమోచక జ్ఞానం యొక్క నిరంతర ఆంతరంగిక స్మృతి నిలవాలని ఈ యోగాభ్యాసం పట్టుపడుతుంది. అంతేగాక ఆ స్మృతిని తీవ్రతరం చేసేందుకు కూడా అది సదా కర్మల రూపంలో, సక్రియంగా, బాహ్యంలోనికి కూడా రావాలని ఈ యోగాచరణ పట్టుబడ్తుంది. ఒకే పరమాత్మ అన్నింటియందు ఉన్నది, సమస్తమూ ఒకే దైవం, దైవంలో సమస్తమూ ఉన్నాయి, సమస్తమూ దైవమే, జగత్తులో మరొకటి లేదు. కర్మ చేయువాని చేతనకు సంబంధించిన మొత్తం ద్రవ్యమంతా, అలా తయారయ్యేంతవరకు, ఈ భావమే, లేదా ఈ విశ్వాసమే నేపథ్యంగా ఉండాలి. ఈ విధమైన ఒక స్మృతి, తనను తాను క్రియోన్ముఖం చేసుకొనే ఒక ధ్యానం, చివరకు దేనినైతే మనం ఎంతో శక్తివంతంగా జ్ఞాపకం పెట్టుకొంటున్నామో, లేదా దేనిపై మనం అంత నిరవధికంగా ధ్యానిస్తున్నామో, దాని యొక్క దృష్టి, దాని యొక్క ప్రకాశమయమైన, దానియొక్క సర్వాలింగక చేతనగా తప్పక పర్యవసిస్తుంది. ఎందుకనంటే అచేతన ప్రతి క్షణం, సమస్త అస్తిత్వపు, సంకల్పం, కర్మల యొక్క దివ్యమూలానికి నివేదిస్తూండమని వత్తిడి చేస్తుంది. అదే సమయంలో, విడి విడి రూపాలు, ఆకారాలు అన్నిటినీ ఆలింగనం చేసుకొని, వాటి నతిశయించి

వాటికి కారణం, వాటి మనుగడ కాధారం అయిన 'తత్ ' కు నివేదించమని వత్తిడి చేస్తుంది. ప్రకాశవంతమైన, బలీయమైన ఒక దృష్టి అంటే భౌతికదృష్టిలా పటిష్టమైన దృష్టితో విశ్వజనీన పరమాత్మ శక్తి యొక్క కర్మలను సర్వే సర్వత్రా చూడగల దృష్టి లేకుండా, ఈ యోగవిధానం తన చరమ లక్ష్యాన్ని చేరలేదు. దాని శిఖరాగ్ర స్థితిలో అది సదా అతిమానసిక, విశ్వాతీత సన్నిధిలో నివసించగల, చింతించగల, సంకల్పించగల కర్మ చేయగల స్థితి కుద్ధరితమౌతుంది. మనం దేనిని చూస్తున్నా, వింటున్నా, స్పృశించినా, పసిగట్టినా, మన యెరుకలో కొచ్చినదాన్నంతా 'తత్ ' గానే మనం ఆరాధించాలి, సేవించాలి, దానినిగానే మనం తెలుసుకోవాలి, సంవేదించ గలగాలి. సమస్తమూ దైవత్వపు ప్రతిరూపంగా మారిపోవాలి, అధిష్ఠాన దేవత యొక్క నివాసస్థలంగా గ్రహింపు కలగాలి, శాశ్వతుని, సర్వవ్యాపకతతో ఆవరించివేసినట్లు తెలియాలి. చరమాంకంలో ఇంకా బాగా ముందుగా గాకపోయినా, కర్మల ఈ మార్గం, దైవసన్నిధానం, దైవేచ్ఛ, దైవక్రియాశక్తితో సంసర్గం వల్ల, దివ్యజ్ఞానమార్గంగా, కేవలం జీవుల వివేక నిర్మాణం, లేదా బుద్ధి అన్వేషణ ఆవిష్కరించగలిగిన జ్ఞాన మంతటికన్న మరింత సంపూర్ణ, సమగ్ర జ్ఞానమార్గంగా మారిపోతుంది.

చివరగా: ఇటువంటి కర్మల యజ్ఞమైన యోగాభ్యాసం, అహంకారానికి సంబంధించిన అన్నివిధాలైన ఆధారాలను త్యజించి, వాటిని మన మనస్సు, సంకల్పం, కర్మల నుండి దూరంగా విసరివేయాలి, అహంకార బీజాన్ని, ఉనికిని, దాని ప్రభావాన్ని మన స్వభావం నుండి తుడిచివేయాలి. సమస్తాన్నీ దైవం కోసమే చెయ్యాలి, సమస్తాన్నీ దైవం వైపే త్రిప్పాలి. మనమొక ప్రత్యేక ఉనికి కలిగినవారమని భావించి మన కోసమంటూ దేనినీ ప్రయత్నించరాదు. ఇతరుల కోసం అంటే ఇరుగుపొరుగువారు, స్నేహితులు, కుటుంబం, దేశం లేదా మానవజాతి, లేదా ఇతర జీవులు వాటితో మన వ్యక్తిగత జీవితానికి, ఆలోచనకు, అనురాగానికి సంబంధ వున్నదని, లేదా వాటి సంక్షేమంలో మన అహం అధికతర శ్రద్ధ వహిస్తున్నదన్న అల్పకారణంతో దేనినీ చేయరాదు. ఈ విధంగా సమస్త కర్మలను చూస్తూ, చేస్తూ వుంటే, సమస్త జీవితమూ ఆతని విశాల విశ్వసృష్టి యొక్క హద్దులు లేని దేవాలయంలోని నిత్యం దైవానికి చేసే క్రియాశీలమైన పూజా, సేవారూపం అవుతుంది. వ్యక్తిలో సదా తనను తాను శాశ్వత విశ్వాతీతుని అధికాధికంగా అర్పించుచేసుకొనే యజ్ఞంగా జీవితం తయారవుతుంది.



భగవంతుని త్రివిధ మార్గపు, ఒక రకంగా, అత్యంత కఠినమైన పార్శ్వం ఈ కర్మమార్గం. అలా కాదని అన్నా, ఈ పదార్థ ప్రపంచంలో, కనీసం, అత్యంత తేలికైనది, విశాలమైనది, అత్యంత ఆనందకరమైనది మాత్రం కాదు. ఎందుకనంటే ప్రతి క్షణం భగవంతునికి వ్యతిరేకంగా తలపడుతూ అతని అస్తిత్వం లోనికి సహస్ర సంస్పర్శల ద్వారా యెదగాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

ఆకాంక్షపరులకు మార్గదర్శనము

కర్మలు సంసిద్ధికి దారితీస్తాయా లేదా అనే నీ సంశయమూ, ఆ అవకాశం అసలు లేనే లేదు అని మొత్తంగా తిరస్కరించడమూ, అసాధ్యమనుకొన్నదానిని సాధించినవారి అనుభవాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. కర్మ వ్యక్తి చైతన్యాన్ని దిగజారుస్తుందనీ అంతర్గత చైతన్యం నుంచీ బాహ్యానికి తెచ్చేస్తుందనీ నీవంటావు. నిజమే, నీవు అంతరంగం నుండి పనిచేయకుండా, కర్మ ద్వారా నిన్ను నీవు బహిర్గతం చేసుకోవా లనుకుంటే అంతే అవుతుంది. అలా కాకుండా ఉండటం నేర్చుకుంటే ఫర్వాలేదు. ఆలోచనలు, భావాలు కూడా మనిషిని బయటకు తెస్తాయి. అయితే ఆలోచనలను, భావాలను ఆచరణనూ కూడా అంతర్గత చైతన్యంతో గట్టిగా పెనవేసుకొనేటట్లు చేసుకొని అక్కడే జీవిస్తూ మిగతాదాన్ని పరికరంగా చేసుకోవచ్చు. అది కష్టమంటావా? కాని భక్తిమార్గం కూడా ఏమీ తేలిక కాదు, చాలామంది అన్నిటికంటె నిర్వాణం కష్ట మనుకుంటారు.

మానవతావాదం, క్రియావాదం, ధార్మికసేవ మొదలైనవాటిని నీవిందులోకి ఎందుకు తెస్తున్నావు? నా మార్గంలో ఇవేవీ లేవు. ఇంకా ఇవేవీ కూడా నేను చెప్పే కర్మాచరణలో ఇమడలేవు. రాజకీయాలుగానీ, బీదలకు అన్నదానాలు చేయటం కానీ, చక్కని పద్యకవితలు వ్రాయడం కానీ సరాసరి పరమాత్మ దగ్గరకు గానీ, వైకుంఠానికిగానీ దారితీస్తాయని నేనెన్నడూ అనుకోలేదు. అదే నిజమైతే రమేష్ దత్తు ఒక వైపూ, బొదెలేర్ మరొక వైపూ మొదటే ఆ అత్యున్నత స్థితిని చేరి మన

లను ఆహ్వానించచడానికి సిద్ధంగా ఉండేవారు. కర్మరూపం, లేదా కర్మలోని కేవల చలనాలు గాక, దాని వెనుక నుండే చేతన, దైవం వైపు సంకల్పం మాత్రమే కర్మ యోగ సారాంశము. కర్మాచరణ కేవలం కర్మాధికారితో ఏకత్వం పొందటానికి అవసరమైన సాధనం మాత్రమే; అవిద్యకు సంబంధించిన, సంకల్పం, శక్తి నుండి పరిశుద్ధ దైవేచ్ఛ, దివ్యవెలుగు శక్తికి చేర్చేది కర్మ.

*

సాధనా మార్గంలో ఏ దశలోనూ కర్మాచరణ అసాధ్యం కాదు. ఏ రహదారిలోనూ నిలదొక్కుకునే ఆధారం లేదనీ, భగవంతునిపై దృష్టి నిలుపుతూ పనిచేయడం పొసగదనీ అనుకొని పని వదిలి పెట్టేయాల్సిన అవసరం ఉండదు. ఆధారం ఎప్పుడూ ఉంటుంది. అదే భగవంతునిపై విశ్వాసము, సత్తలో ఉన్మీలనం, సంకల్పాన్నీ, శక్తినీ భగవంతునికి సమర్పణము గావించడము. ఈ జ్ఞానంతో పనిచేయడమే సాధనామార్గంగా చేసుకోవచ్చు. అక్కడా అక్కడా కొంతమందికి పని మధ్యలో ఆపుచేసిగానీ, పక్కన పెట్టిగాని ధ్యానంలో నిమగ్నం కావలసిన అగత్యం ఉండవచ్చు. కానీ అలా ఎక్కడో ఒక సందర్భమే. అదైనా తాత్కాలిక విరమణే కదా! అంతకు మించి పూర్తిగా పని విరమించి అంతర్ముఖులైపోవడం మాత్రం ఉచితం కాదు; అది మనిషిని ఎటూకాని స్థితిలో పడేస్తుంది. అంటే బాహ్యవాస్తవంతో గానీ అత్యున్నత సత్యంతో గానీ ఏమాత్రం పట్టులేని ఏకపక్ష కల్పిత అనుభూతులతో బతికేటట్లు ప్రోత్సహిస్తుంది. ఇంకా తన అనుభూతుల ద్వారా జీవితంలో పొందే బాహ్యసిద్ధికి అత్యుత్తమ సత్యానికి గట్టి బంధమేర్పరచి, ముడిపెట్టి ఆ తర్వాత వాటి నేకీకరించడానికి తన స్వీయ ఆంతరిక అనుభవం సక్రమంగా ఉపయోగపడకుండా చేస్తుంది.

*

రూపాంతరీకరణలో బాహ్యచైతన్యాన్ని చేర్చడమనేది ఈ యోగంలో అత్యంత ముఖ్యము. ధ్యానంతో అది సాధ్యం కాదు. ధ్యానం కేవలం ఆంతరికసత్తకు సంబంధించినది. అందువల్ల పనికే ప్రథమ ప్రాధాన్యత వస్తుంది. అయితే సరైన వైఖరితో, సరైన చైతన్యంతో మాత్రమే పనిచేయాలి.

*

దైవాన్ని మినహాయించి కర్మయందే మనస్సును నిలుపకపోతే కర్మ చాలా సరళమైన రాస్తా అవుతుంది. లక్ష్యం దైవమే కావాలి, పని దానికి దారితీసే సాధనము మాత్రమే.

కవిత్వము మొదలైనవి అంతర్గత సత్త సంసర్గంలో ఉండటానికీ, తద్వారా అంతరాత్మతో పొందుకు సిద్ధం కావటానికీ సాయపడతాయి. అయితే అంతటితో ఆగిపోకుండా సత్పదార్థ దిశగా వెళ్ళాలి. సాహితీవేత్తగా, కవిగా, చిత్రకారునిగా ఉండి వాటి కోసం పాటుబడాలనుకుంటే అది యోగపరిధిలోకి రాదు. ఆ కారణం వల్లనే మనం కేవలం కవులు, చిత్రకారులుగా ఉండకుండా యోగులుగా మాత్రమే ఉండాలని నేను చెప్పవలసి వస్తూంటుంది.

*

నీకు నచ్చని పనులు చేయమని చెప్పటం లేదు. కానీ ఆ నచ్చకపోవడమనేదే ఉండకూడదు. నీకు నచ్చినవి మాత్రమే చేయడమంటే ప్రాణికానికి లోబడి నీ స్వభావంపై దాని పెత్తనం చెలాయించ నివ్వడమే. రూపాంతరం చెందని మన స్వభావానికి మూలసూత్రం, ప్రాణికాల ఇష్టాలు, అయిష్టాల అజమాయిషీలో నుండటము. దేన్నైనప్పటికి సమభావంతో చేయటమనేది కర్మయోగపు మూలసూత్రము. ఇంకా అది శ్రీమాత పని అనుకొని దాన్ని సంతోషంతో చేయడమనేదే ఈ యోగంలో అసలైన చైత్యకస్థితి, ప్రాణికస్థితి.

*

సాధారణంగా ప్రతి కళాకారుని ప్రాణిక, భౌతిక భాగాల్లో కొంత లౌకిక అంశ ఉంటుంది.అరుదుగా ఉండకపోవచ్చు కూడా. ఈ లౌకిక అంశ వల్ల ప్రేక్షక ప్రశంసల కోసమనీ, సంఘంలో మెప్పుపొందాలనీ, డాంబికంగా ఉండాలనీ, పేరుప్రతిష్టలు పొందాలనీ తహతహ మెండుగా ఉంటుంది. యోగి కావాలనుకుంటే అది అసలు ఉండకూడదు. నీ కళలన్నీ కూడా నీ అహాన్ని తృప్తిపరచడం కోసం కానీ, ఒకరి కోసంగానీ, ఒక ప్రయోజనం కోసం కానీ కాక కేవలం భగవత్సేవకే ఉపయోగపడాలి.

*

పనిచేస్తూ భగవంతుని తలచుకోవడమెలా?

నీవు గానీ మరే సాధకుడుగానీ సాధన గురించి కష్టంగా భావిస్తున్నారంటే అది నిజానికి ధ్యానం, భక్తి, కర్మలలో ఏది అనేదాన్ని గురించినది కాదు. అవలంబించవలసిన వైఖరికి, అనుసరించాలనుకునే విధానానికీ, మరేదో దానికీ సంబంధించినదే అ కష్టం.

ఇప్పటికి కూడా పనిలో ఉన్నప్పుడు భగవంతుని గుర్తుంచుకోలేకపోతున్నారంటే అదేమంత పెద్దగా పట్టించుకోవలసిన విషయం గాదు. పని ప్రారంభిస్తున్నప్పుడు

తలుచుకొని భగవదర్పణ చేసి ఆ తర్వాత చివరలో ధన్యవాదా లర్పిస్తే ప్రస్తుతానికి సరిపోతుంది. ఇంకా కావాలంటే నీకు విరామం దొరికినప్పుడల్లా తలుచుకున్నా చాలు. నీ వనుసరిస్తున్న పద్ధతి కొంచెం కష్టంగా, బాధాకరంగా అనిపిస్తోంది. నీవు మనసులోని ఒకే భాగంతో, పనిచేస్తూ, గుర్తుంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లున్నావు. అది సాధ్యమౌనో కాదో నాకు తెలియదు. ఎవరైనా పనిచేస్తున్నంత సేపూ తలుచు కుంటున్నారంటే (అలా చేయవచ్చు) అది వారి మనసులోని వెనక భాగంతో కావచ్చు, లేదంటే ఒకే సమయంలో ద్వంద్వాలోచన చేసే సామర్థ్యం పెంపొంది యుండవచ్చు, లేక ద్వంద్వ చైతన్యం కలిగి వుండవచ్చు; ఒకటి పనిచేస్తూ ముందు భాగాన వుంటే, రెండోది లోపల నుండి చూస్తూ గుర్తుంచుకొంటూ ఉంటుంది. ఇదీ కాక ఇంకో పద్ధతి ఉంది; (నేను చాలా కాలం అలా చేశాను.) చైతన్యం మాత్రం నిశ్శబ్దంగా భగవంతునిలో ఉండిపోతుంది. అది ప్రయత్నపూర్వకంగా గాకుండా నిరంతరమైన ఆకాంక్ష, అంకితభావం వల్ల లభిస్తుంది. లేదా బాహ్యసత్త నుంచి, ఆంతరిక సత్తను వేరుచేసే చైతన్యచర్య వల్ల జరుగవచ్చు. కానీ ఆకాంక్ష, సర్వసమర్పణ గావించుకునే సంకల్పముతో మహనీయ దివ్యక్రియాశక్తిని దిగువకు ఆవాహన చేస్తే మంచి ఫలితం ఉంటుంది. కాలం ఎక్కువ పట్టినప్పటికీ మంచి ఫలితాలు కనిపిస్తాయి. మన వెనకా, ముందూ ఉండే దివ్యశక్తిని పిలిచి మనస్సుకు శ్రమ లేకుండా పని జరిపించుకోవడం ఒక సాధనా రహస్యము. మనసుతో కృషి అవసరం లేదు, ప్రయోజనం ఉండదు అనేది నా ఉద్దేశ్యం కాదు; కానీ అన్నీ అదే చేయాలనుకుంటే ప్రయాస అవుతుంది; ఆధ్యాత్మిక యోధులైతే అలా చేయగలరు. అయితే మొదటిదే అభిలషణీయమైన దగ్గర దారి అని నేను చెప్పటం లేదు. ఫలితాలకు చాలా కాలం పట్టవచ్చు. ఏ సాధన చేయాలన్నా గట్టి పట్టుదల, ఓర్పు అవసరము.

బలాఢ్యులకు బలం సరే. కానీ ఆకాంక్ష దానికి బదులు పలికే దైవ అనుగ్రహాలు పూర్తిగా అభూత కల్పన గాదు. అవి ఆధ్యాత్మిక జీవితపు గొప్ప సత్యాలు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

శ్రీ అరవిందుల మంత్రవాక్కులు

దివ్యకర్మల్ని నువ్వు నిజంగా చేయాలని కోరుకొన్నట్లయితే, అన్ని కోరికలు, స్వార్థ పూరిత అహంకారం నుండి పూర్తిగా విముక్తం కావాలి. అది మొదటి లక్ష్యం. నీ జీవితం పరమాత్మునికి అర్పణగా, బలిదానంగా మారాలి. దివ్యశక్తి కర్మల పరంపరలో సేవ చేయడం, స్వీకరించడం, సఫలీకృతం చేయడం, పూర్ణ ఉపకరణంగా మారడమే నీ ఏకైక లక్ష్యం కావాలి. నీ సంకల్పం, ఆమె సంకల్పం మధ్య తేడా ఉండకూడదు. నీలో ఆమె ఉత్ప్రేరణ తప్ప మరో ఉద్దేశ్యం ఉండకూడదు. నీలో నీ ద్వారా ఆమె చర్య తప్ప నీ చర్య ఉండకూడదు. అంతవరకు దివ్యచేతనలో నువ్వు పెరుగుతూ ఉండాలి.

ఈ పూర్ణ చైతన్యమయమైన సారూప్యం నువ్వు సాధించేవరకు, ఆమె తనను సేవించడం కోసం సృష్టించిన దేహాత్మ రూపంలా నిన్ను నీవు భావించుకోవాలి. అంతా ఆమె కోసమే నువ్వు చేస్తుండాలి. నేను విడిగా కర్మ చేస్తున్నానన్న భావన వస్తే, నేనే చేస్తున్నానన్న భావన వుంటే, ఆ కర్మలు ఆమె కోసమే చేసి తీరాలి. అహంతో నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పరుగులు తీయడం, స్వార్థపూరితమైన వాంఛలను తీర్చుకోవడం — ఇవన్నీ నీ ప్రకృతి నుండి తుడిచి పెట్టాలి. ఫలితం కోసం పట్టువీడాలి. బహుమతిని ఆశించకూడదు. నువ్వు సంపాదించే కిరీటం (ఫలితం) జగన్మాత ఆనందమే. అది ఆమె పని సాఫల్యమే. దివ్యచైతన్యంతో, ప్రశాంతితో, బలంతో, ఆనందంతో నిరంతర పురోగమనమే నీ బహుమతి.

సేవ వల్ల ఆనందం, కర్మల ద్వారా అంతరంగ విధానం — ఇవే నిస్వార్థ సాధకునికి చాలినంత ప్రతిఫలం.

కాని నువ్వు ఉపకరణం అని, సాధకుడ్ని కానని భావించే సమయం వస్తుంది. మొదట నీ భక్తి మహత్వశక్తి వల్ల జగన్మాతతో సంపర్కం ప్రగాఢం కావాలి. అప్పుడు నువ్వు ఏకాగ్రచిత్తంతో, ఆమె నిన్ను ముందుకు నడపడానికి దారిచూపే దేవతగా భావించి, ఆమె ఆదేశం, ఉత్ప్రేరణ కోసం, నీ సమస్తం ఆమె చేతులలో పెట్టాలి. ఏ పని చేయాలో గట్టి సూచనలు, ఆ పని చేసే విధానం,ఫలితం అన్నీ ఆమె నుండే రావాలని తపించిపోవాలి. దివ్య మాతృశక్తి దివ్యావేశం కలిగించి, దారి చూపడమే కాదు, తానే స్వయంగా రంగంలోకి దిగి, నీ పనులను నిర్వర్తిస్తుంది.

నీ కదలికలన్నీ ఆమె నుండే. నీ శక్తులన్నీ ఆమెవే. జీవ, మనశ్శరీరాలు ఆమె దివ్యకర్మల చేతనాత్మక ఉపకరణాలుగా మారతాయి. ఆమె లీలకు సాధనాలు. భౌతిక విశ్వంలో ఆమె అభివ్యక్తికి మూసలుగా మారతాయి. ఈ సాయుజ్యం పొందడం, ఆమెపై ఆధారపడడం కన్నా మించిన ఆనందస్థితి లేదు. అలా చేయడం వల్ల, అజ్ఞానసీమలో బాధలు, సంక్షోభాల సరిహద్దు రేఖ నుండి నీ ఆధ్యాత్మిక జీవన ఆనంద అమృత శిఖరాలకు ప్రగాఢ శాంతి, ప్రగాఢ ఆనందం వైపు నువ్వు ప్రయాణిస్తావు.

ఈ పరివర్తన సంభవిస్తున్నప్పుడు అహం నుండి బయలుదేరే అన్ని వైకల్యాల నుండి నువ్వు దూరమవడం అవసరం.

దేని కోసమైనా పట్టుపట్టే గుణం ఆత్మార్పణను, ఆత్మత్యాగాన్ని, వాటి పవిత్రతను కలుషితం చేయకుండా చూడాలి. చేసే పని ఫలితానికి బంధం ఉండకూడదు. షరతులు విధించకూడదు. నిన్ను ఆవహించే మహాశక్తిని పొందాలన్న కోరిక ఉండకూడదు. గర్వం, దురహంకారం, పొగరుబోతుతనం అసలే పనికి రావు. నీలో ప్రసరించే దివ్యశక్తుల అహంత మనస్తత్వాన్ని వ్యక్తిగత సంతృప్తి కోసం వాడుకోరాదు. మనస్సు కాని, ప్రాణికంకానీ, భౌతిక విభాగాలు కాని ఆ శక్తుల్ని తమ సొంతానికి వాడుకోవడం పనికి రాదు. నీ విశ్వాసం, నీ నిజాయితీ, నీ ఆకాంక్షలో స్వచ్ఛత, పరిపూర్ణమైనవిగా ఉండాలి. నీలోని అన్ని భూమికలకు వ్యాపించాలి అప్పుడు కలవరపరచే ప్రతి అంశమూ, అపభ్రంశాన్ని సృష్టించే ప్రభావాలూ నీ ప్రకృతి నుండి నెమ్మదిగా రాలిపోతాయి.

జగన్మాతతో పూర్తిగా సాయుజ్యం చెందినప్పుడు, నువ్వు విడిగా మరో జీవాత్మ కాదని, ఉపకరణం కాదని, సేవకుడివి, సాధకుడివి కావని, ఆమె చైతన్యం, శక్తి నుండి రాలిన ఒక శాశ్వత అంశ అని, ఆమె శిశువు అని గ్రహించిననాడు పరిపూర్ణత్వపు చివరి దశ వస్తుంది. ఆమె నీలోనే వుంటుంది నువ్వు ఆమెలోనే వుంటావు; నీ ఆలోచన, వీక్షణం, చర్యలు, నీ ఉచ్ఛ్వాసనిశ్వాసలు. నీ కదలిక ఆమె నుండి వస్తాయి. ఆమెవే. అది శాశ్వతమైన, సహజమైన, సరళమైన అనుభవం అవుతుంది. తన నుండి ఆమె రూపుదిద్దిన వ్యక్తిత్వం, శక్తివని నువ్వు గ్రహిస్తావు. విశ్వము కోసం ఆమె తన నుండే నిన్ను పంపిందని, ఆమెలోనే భద్రంగా ఉంటావన్న భావన కలుగుతుంది. ఆమె అస్తిత్వంలో అస్తిత్వంగా, చైతన్యంలో చైతన్యంగా, ఆమె

శక్తిలో శక్తిగా, ఆనందంలో ఆనందంగా నువ్వు జీవితాన్ని గడుపుతావు. ఈ భావస్థితి సర్వ సమగ్రంగా భాసించినప్పుడు, ఆమె అతిమానసశక్తులు నిన్ను స్వేచ్ఛగా కదిలించినప్పుడు, అప్పుడు నువ్వు దివ్యకర్మలలో దివ్యపరిపూర్ణత్వం సాధించినట్లే. జ్ఞానం, సంకల్పం, సత్కర్మ అన్ని సరళమై, సునిశ్చితమై, ప్రకాశవంతమై, సహజమై, కల్మషరహితమై పరమాత్మ నుండి తన ప్రవాహంగా నీ జీవితం మారుతుంది. శాశ్వతత్వపు దివ్యచలన మవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

సక్రమ వైఖరి

మనసులో ధ్యానంలోనే కాకుండా, బాహ్యమైన చర్యలలో, కదలికలలో నువ్వు సద్వైఖరి అవలంబించాలి. ఆ పని చేసి, సమస్తాన్ని దారిచూపే జగన్మాత హస్తాలకు వదిలివేస్తే కష్టాలు తొలగిపోతాయి. తేలికగా కష్టాలు అధిగమించవచ్చును. పరిస్థితులు నెమ్మదిగా మరింత చక్కబడతాయి.

నీ ఏకాగ్రతలో చేస్తున్నట్లే, నీ పనులలోనూ, సాధనలోనూ చేయవలసి వుంది. జగన్మాతకు హృదయాన్ని తెరిచి వుంచు. ఆమె సహాయాన్ని అర్థించు. శాంతిని ఆవాహన చెయ్యి. నీకు ఆధారమైన శక్తిని, సంరక్షణను కోరుకో. అవన్నీ పని చేయడానికి, దుస్సంకల్పాలు, దుష్టచలనాలు, నిర్లక్ష్య మైన, అచేతనామయమైన దుర్గుణాలను పోగుచేసి దారి కడ్డుగా నిలిచే దుష్ప్రభావ సంచయాన్ని తిరస్కరించాలి.

ఈ సూత్రాన్ని అనుసరించు. ఒకే నియమ కాంతిలో, నీ అస్తిత్వమంతా ఒక్కటిగా నిలబడుతుంది. అప్పుడు శాంతి నీపై ప్రవహిస్తుంది. ఒక మహాశక్తి, ఒక మహత్కాంతి రక్షణకవచమై నిన్ను కాపాడుతుంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న